# జనపదం

J A N A P A D H A M

హైదరాబాద్ | బుధవారం 09 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 122

తెలుగు దినపత్రిక


## మా పరువు పోయింది..



- మంత్రి మాటలతో నొచ్చుకున్నాం..
- నా ఫ్యామిలీపై కొండా సురేఖవి తప్పుడు వ్యాఖ్యలు
- దేశమంతా అభిమానులున్న కుటుంబం మాది..
- కోర్టులో హీరో నాగార్జున స్టేట్‌మెంట్
- విచారణ రేపటికి వాయిదా
- మరో సాక్షి వాంగ్మూలం కూడా అదే రోజు

5



ఓటరు నాడీ పసిగట్టడం ఎవరి తరం కాదనేది అక్షర సత్యం. సర్వేలు, అంచనాలు అంతా తూచ్ అని తేలిన సందర్భం. ఎవరి లెక్కలు వారు తీసినప్పుడు ఓటరు లెక్క కూడా ఓటరుకు ఉంటుంది కదా. ఎవరికి చెప్పక, ఎక్కడా తొనకక ఆయన స్టైల్ లో ఆయన తానేంటో చూపించడం సహజమే కదా. అచ్చు అదే జరిగిది. ఇది కదా విలక్షణ తీర్పు అనేలా నిరూపించారు. కోడైకూసిన ఊహాగాళ్ల గూబ గుయ్యుమనిపించడమే కాదు., అదే నిజమని ఎగిరిన పార్టీలను నేలపై పడుకోబెట్టారు. ఊహించని తీరుగా హర్యానాలో కమలం వికసించగా, జమ్మూకశ్మీర్ లో చేతి పై చేయి సాధించింది. అనుకున్నది., అనుభవంలోకి వచ్చింది పూర్తి విరుద్ధం కావడంతో దేశమంతా బిత్తరపోయింది.

# దటీజ్ ఓటర్..


## రెండు రాష్ట్రాల్లోనూ తారుమారే..

- హర్యానాలో కమలం వికాసం..
- జమ్మూకశ్మీర్ లో చేయి ప్రతాపం..
- తుడిచిపెట్టుకుపోయిన చీపురు..
- 'ఎగ్జిట్' మొత్తం తూచ్..
- ఫలితాల వెల్లడితో పోస్టుమార్టం మొదలెట్టిన పార్టీలు..

జనపదం, ఢిల్లీ: హర్యానాలో మూడోసారి బీజేపీ సత్తా చాటింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ ముచ్చటగా మూడోసారి అధికారాన్ని చేజిక్కుంచుకుంది. మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు 48 స్థానాలు గెలుచుకొని బీజేపీ హ్యాట్రిక్ కొట్టింది. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ 37 సీట్లు కైవసం చేసుకుంది. ఐఎన్ఎల్డీ 2, ఇతరులు 3 స్థానాల్లో విజయం సాధించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఖాతానే తెరవలేదు. కౌంటింగ్ ఆరంభంలో ముందంజలో ఉన్న కాంగ్రెస్, కొద్దిసేపటికే రెండో స్థానానికే పరిమితమైంది.

**కాంగ్రెస్‌కు కలిసిరాని వ్యతిరేకత**

పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ ఫలితాలు మొత్తం తారుమారు అయ్యాయి. పదేళ్ల పాలనలో బీజేపీపై నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకత, రైతు చట్టాల నిరసనలు, రెజర్ల ఆందోళనలు, జాట్ల అసంతృప్తి వంటి అంశాలు రాజకీయ అస్త్రాలుగా మారినా– అవి కాంగ్రెస్‌ను గెలుపు దిశగా నడిపించలేకపోయాయి. జాట్‌లు, ఎస్సీ ఓటర్లు 40శాతం ఉన్నా, కాంగ్రెస్‌కు కలిసిరాలేదు. రైతులకు కనీస మద్దతు ధర వంటి ఏడు గ్యారెంటీలతో వరాలు జల్లు కురిపించినా ఆశించిన ......(తరువాయి 2లో)




# విస్తరణకు విశ్రాంతి..

## ఇప్పట్లో లేనట్టే..?! నామినేటెడ్ తో సరి..



- ఢిల్లీలో రోజంతా ఒంటరిగానే రేవంత్..
- అపాయింట్ మెంట్ ఇవ్వని పెద్దలు..
- హర్యానా షాక్ లో అధిష్ఠానం
- నైరాశ్యంలో ఆశావహులు..
- ముగిసిన సీఎం ఢిల్లీ పర్యటన
- కేంద్రమంత్రులు అమిత్‌షా, ఖట్టర్‌ను కలిసిన రేవంత్
- వరద సాయం, విభజన హామీలు..
- ఐపీఎస్‌ల కేటాయింపుపై చర్చించిన సీఎం రేవంత్

కొండంత రాగం తీసి ఏదో పాట పాడినట్టు.., నెలలకు నెలలుగా అరచేతిలో బెల్లం పెట్టి మోచేతిని నాకిస్తున్నట్టు.., తీరుస్తారనుకున్నది ఊరిస్తూ ఏదో సాకుతో వాయిదా వేస్తూ., ఆగం చేస్తున్న తీరు అమోఘం., అత్యద్భుతం. నిన్నటి దాకా కొంచెం ఆశలైనా ఉండేగానీ, ఇయ్యాళ్టితో ఇక అయ్యేది ఇప్పట్లో లేదు., ఎప్పటికి అవుతుందో కూడా తెలియదు. ఇన్నాళ్లు కమ్ముకున్న పొరలు కాస్తా, ఆ రెండు రాష్ట్రాల ఫలితాలతో పూర్తిగా తొలగిపోవడంతో ఇక అమాత్య కొలువుల భర్తీ మరెప్పటికి మోక్షమో ఆ పైవాడికే తెలియాల్సిన పరిస్థితి. పాపం...... ఇదంతా తెలియక ఏదో ఓటి తేల్చుకుని పోదామని ఒంటరిగా ఎగేసుకెళ్లిన మన ముఖ్యమంత్రేమో మంగళవారమంతా ఢిల్లీ వీధుల్లో ఆగమాగం తిరిగిండు. ఇగ టైం ఇవ్వక పోతరా.., అగ కబురు పెట్టక పోతారా.. అని చూసీచూసీ కండ్లు కాయలు కాయడంతో చేసేది లేక వెర్రెత్తిన చిరాకుతో రిటర్న్ ఫ్లైట్ లో తిరుగుటపా కట్టారు. ఏదిఏమైనా మంత్రులం కాబోతున్నామని ఫుల్ ఖుషీగా ఉన్న నేతలారా.. ఇప్పటికి మీ గతి ఇంతే.., మరెప్పటికైనా జరుగకపోతుందా.. అని ఆశగా గడపండంతే.......

**జనపదం, బ్యూరో:**

నిదానంగా గమనించాలి., అవకాశం కోసం వేచి చూడాలని, అధిష్టానం చెప్పు చేతుల్లో మెదలాలి., వారి అనుగ్రహం కోసం తచ్చాడాలి.., అన్నీ చేస్తున్నా అదృష్టం కలిసొచ్చే వరకు ఓపికగా నిరీక్షించాలి. అంతేగానీ లేడికి లేచిందే పరుగు అన్న మాదిరి యవ్వారం ఇక్కడ పని చెయ్యదు. పట్టిన కుందేటికి మూడేం ఖర్మం మరెన్ని అన్నా ఆశ్చర్యం ప్రదర్శించకుండా గమనించాలంతే. ఇది కాంగ్రెస్ మార్క్ రాజకీయం. పది నెలలుగా ఊరిస్తున్న పదవుల కోసం చూసినోళ్లంతా ఇక ఇప్పట్లో కాదుగానీ అదొచ్చినప్పుడు లేపండి అన్నట్టుగా నిద్రకు ఉపక్రమించేంత వైరాగ్యం. ఆయన ఢిల్లీ వెళ్లడం, ఒకటి రెండు రోజులు బిజిబిజిగా గడపడం, ఏదో మోసుకుని వస్తాడనే ఆత్రుతతో ఉన్నవారు ఎదురేగడం, ఓ మంచి ముహూర్తం చూసుకుని ఇప్పటికింతే.. అనే కంక్లూజన్ విని తువ్వాల దులుపుకుంటూ వెనుతిరగడం.. పరిపాటిగా జరుగుతున్నదే.

**ఇప్పట్లో లేనట్టే..?!**

పదవుల పంపకం ఇప్పట్లో లేనట్టే అనేది స్పష్టంగా తెలిసిపోయింది. దఫలవారీగా భర్తీ ప్రక్రియ ఉంటుందని హామీలు గుప్పించిన బాధ్యులు ఇప్పటికైతే ఇంతే అనే స్పష్టతతో తిరిగిరావడంతో తెలియని అనిశ్చితి., ఏమీ మాట్లాడలేని నిశ్శబ్దం. నామినేటెడ్ పదవులను విడుత వారీగా నింపుతూ, కష్టపడ్డొలను కాపాడుకుంటూ వెళ్తున్న తీరు బాగానే ఉన్నా, మరి మన వరకు వచ్చే సరికే ఎందుకింత నిర్లక్ష్యమనే నిరాశతో సీనియర్లంతా ఉసూరుమంటున్నారు. పుణ్యకాలం గడిచిపోతున్నది, ఇప్పుడుకాకుంటే ఇక ఎప్పటికీ టోపీ పెట్టుకుని వెళ్లాల్సిందే అనే అభద్రతతో ఉన్నవారంతా ఈ సారి కూడా సారీ.. అనే సమాధానంతో సర్దుకుని బయలుదేరారు. ఏతావాత నామినేటెడ్ వాళ్ల పరిస్థితి బాగుందరి రా బాబూ.. అనే అభిప్రాయానికి కూడా కొందరొచ్చినట్టు సమాచారం.

**ఢిల్లీలో రోజంతా ఒంటరిగానే రేవంత్..**

మావోయిస్టుల ప్రభావిత రాష్ట్రాల సమావేశానికి షా నుంచి అందిన ఆహ్వానం మేరకు సీఎం రేవంత్ ఢిల్లీకి బయలుదేరారు. సోమవారం ఆయా కేంద్ర మంత్రులను కలుస్తూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం కావాల్సిన వారికి మొరపెట్టుకుంటూ బిజిబిజిగా గడిపారు. కానీ, ఇవ్వాళ ప్రభుత్వంలో పలువురి భాగస్వామ్యం పెంచే అతికీలకమైన మంత్రి వర్గ విస్తరణపై పార్టీ ......(తరువాయి 5లో)



## గ్యారంటీ గారడీని జనం నమ్మలేదు..

### కర్రు కాల్చి వాతపెట్టిన ప్రజలకు జోహార్లు..

- హర్యానా ప్రజల తీర్పు చెంపపెట్టు..
- తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రభుత్వాల వైఫల్యాలు వెంటాడాయి..
- అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ రాజకీయం..
- 2029 లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

4



## ఈడీ ఎదుట అజారుద్దీన్..

- కుట్ర పూరితంగా కేసులు పెట్టారు..
- ఈడీ అధికారులకు సహకరించా
- భారత క్రికెట్ మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్



## తెలంగాణ అంటే పర్యాటకం..

- పెట్టుబడులకు అనువైన రాష్ట్రం
- లాస్ ఏంజెల్స్ లో మంత్రి జూపల్లి కృష్ణారావు
- రాష్ట్ర పర్యాటకంపై అంతర్జాతీయ స్థాయి ప్రచారం

4

# వర్గీకరణ అమలుకు న్యాయ కమిషన్..

## ఏకవ్యక్తి ఆధ్వర్యంలో నియామకం..



- ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన అధికారుల బృందం
- పరిగణనలోకి అడ్వకేట్ జనరల్ సూచనలు..
- రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు..
- ఉత్తమ్ అధ్యక్షతన భేటీ..
- హాజరైన దామోదర్, దుద్దిళ్ల, సీతక్క, పొన్నం

5

# చకచకా లెక్కలు..

- రాష్ట్రంలో కుల గణన విధివిధానాలపై కసరత్తు
- నెల రోజుల్లోగా పూర్తి చేసే యోచన
- త్వరలోనే ప్రభుత్వ పెద్దల భేటీ
- పొన్నం ఆధ్వర్యంలో కీలక సమావేశం..

జనపదం, హైదరాబాద్ సిటీ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుల గణన చేయడానికి వేగంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. ఈ గణనపై షెడ్యూల్ ఖరారు చేయడానికి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో మంగళవారం సచివాలయం లోని ఆయన ఛాంబర్ లో కీలక సమావేశం జరిగింది. సమావేశంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తో పాటు ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు, సభ్యులు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బీసీల్లో రిజర్వేషన్స్ ఖరారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్ ను

.......(తరువాయి 4లో)

# గోల్మాల్ గ్యారంటీలు..



### పండుగ పూట పస్తులు..

- తెలంగాణ బతుకు బండి పట్టాలు తప్పింది..
- ఇది రేవంత్ సర్కార్ స్పెషల్..
- ఓట్లేసిన యువతే నిలదీయాలి..
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- రేవంత్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు..

**జనపదం, బ్యూరో :**

చిరుద్యోగులకు జీతాలు ఇవ్వకుండా పండుగపూట రేవంత్ రెడ్డి పస్తులు పెడుతుండని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ, దసరా పండగలు ఆనందంగా జరుపుకోవాల్సిన పండగలు, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ఎంతో మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆశాలు, అంగన్‌వాడిలు, పార్ట్ టైం లెక్చరర్ లు పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటవ తేదీన జీతాలు ఇస్తున్నమన్న ప్రభుత్వం ఆచరణలో జరగడం లేదని మండిపడ్డారు. పోలీసులకు పది నెలల సరెండర్ లీవ్ డబ్బులు ఇవ్వలేదని ప్రతి నెల హోం గార్డ్ జీతాలు ఆలస్యంగా ఇస్తున్నారన్నారు. తెలంగాణలో బతుకమ్మ పండగ మహిళలకు అతి పెద్ద పండగ అని అర్పిలకు మూడు నెలలుగా జీతాలు లేక పండగను సంతోషంగా జరపుకోవడం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు మార్చ్ నెల నుండి రాక ఇబ్బంది పడుతున్నారని గాంధీ, ఉస్మానియా ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు ఇప్పటికి రాలేదని విమర్శించారు. పండగ పూట జీతాలు ఇయ్యక ఉద్యోగుల ఉసురు పోసుకుంటుంది రేవంత్ ప్రభుత్వం అన్నారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కేవలం మూడు నెలల పెన్షన్ మాత్రమే వేశారని మిగతా రెండు నెలల పెన్షన్ ఇప్పటికి అందలేదన్నారు. మూసీ కోసం లక్ష యాభై వేలు కోట్లు ఖర్చు పెడతామంటున్న మీరు రెండు వేల పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వృద్ధుల మీద, వితంతుల మీద రేవంత్ ప్రభుత్వం ఎందుకు వివక్ష అని ప్రశ్నించారు. బకాయి పడ్డ రెండు నెలల పెన్షన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది దసరా సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నమ్మి తమ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని గ్రామాల్లో ప్రచారం చేసిన యువత ఒక్కసారి ఆలోచించాలన్నారు. ఈ దసరాకు మీ ఊళ్లకు వస్తున్న యువత కాంగ్రెస్ చేసిన మోసాన్ని కుటుంబ సభ్యులకు వివరించి చెప్పండని పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతకు ఏడాదికి రెండు లక్షల ...(తరువాయి 4లో)



## హైడ్రాతో సర్వే ఆఫ్ ఇండియా

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించేందుకు భారీ కసరత్తు
- ప్రాధాన్యత క్రమంలో చెరువుల పునరుద్ధరణ

4

# హర్యానా బీజేపీదే..



(మొదటిపేజీ తర్వాయి) ప్రయోజనం లేకుండా పోయింది. ఎలాగైనా అధికారం చేపట్టాలని భావించిన కాంగ్రెస్‌కు ఓటమి తప్పలేదు. కానీ బీజేపీకి గట్టి పోటీ ఇచ్చింది.

### బీజేపీకే ప్రజల మద్దతు

ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపించినా ప్రజలు మాత్రం వరుసగా మూడోసారి మోడీ నాయకత్వానికే జై కొట్టారు. జాట్‌ల మద్దతు తగ్గడం వల్ల కలిగే నష్టాన్ని యాదవుల ఓట్లతో భర్తీ చేసుకోవాలని బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న అహిర్వార్ ప్రాంతంలో యాదవుల ఓట్లను రాబట్టుకునేందుకు తీవ్రంగా ఆ పార్టీ కృషి చేసింది. అంతేకాకుండా మహిళలకు లక్ష్మి యోజన కింద మహిళలకు నెలకు రూ.2,100, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, హర్ ఘర్ గృహిణి యోజన కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలతో ఓటర్లను ఆకట్టుకుంది. యువత, పేదలు, రైతులు, మహిళలను ఆకర్షించే విధంగా మేనిఫెస్టోను విడుదల చేసి ప్రజల మద్దతును సాధించింది.

### ఆమ్ ఆద్మీకి నిరాశే..

హర్యానా, జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగిన ఆమ్ ఆద్మీ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు షాక్ ఇచ్చాయి. ఇప్పటికే ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్ తమ పరిధిని విస్తరించుకోవాలని చూసినా.. ఆశాభంగం తప్పలేదు. హర్యానా ఒక్కస్థానంలోనూ ఆప్ ఖాతా తెరవకపోవడం గమనార్హం. ఇక జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆమ్ ఆద్మీ పార్టీ' దోడా అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపొందింది. ఆ పార్టీ అభ్యర్థి మేహరాజ్ మాలిక్ తన సమీప బీజేపీ ప్రత్యర్థి గజయ్ సింగ్ రాణాపై 4,770 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఇప్పటికే ఢిల్లీలో బీజేపీ నుంచి సవాలు ఎదుర్కుంటున్న ఆమ్ ఆద్మీ పార్టీకి ఈ ఎన్నికల ఫలితాలు షాక్ ఇచ్చాయని అనుకోవచ్చు. మరికొద్ది రోజుల్లో మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలతో పాటు ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో హర్యానా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో ఎదురైన ఫలితాలు ఆప్‌నకు నిరాశ కలిగించడం సాధారణమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### తప్పిన ఎగ్జిట్ పోల్..

హర్యానా ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్ లెక్క తప్పింది. ఏ ఎన్నికల్లో అయినా మెజార్టీ ఎగ్జిట్ పోల్ సంస్థలు చెప్పిన సీట్లకు కొంచెం అటు ఇటూగా తుది ఫలితాలు వస్తాయి. అయితే తాజాగా జరిగిన రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వెలువరించిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు పూర్తిగా తప్పాయి. హర్యానాలో కాంగ్రెస్ పార్టీదే స్పష్టమైన విజయం అని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ సంస్థలు అంచనా వేయగా.. ఇక జమ్మూ కాశ్మీర్‌లో ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం రాదని, హంగ్ అసెంబ్లీకి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నాయి. కానీ ఫైనల్ రిజల్ట్స్ మాత్రం అందుకు భిన్నంగా రావడం గమనార్హం.



## జమ్ముకశ్మీర్‌లో ఎన్‌సీ, కాంగ్రెస్ కూటమి విజయం

### మ్యాజిక్ ఫిగర్ ను మించి రెండు సీట్లు



**జనపదం, బ్యూరో:** ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. మ్యాజిక్ ఫిగర్ కన్నా రెండు సీట్లు ఎక్కువగా గెలుచుకుంది. ఎన్‌సీ 42 చోట్ల, కాంగ్రెస్ 6 స్థానాల్లో విజయ దుందుభి మోగించాయి. బీజేపీ 29 సీట్లను సొంతం చేసుకుంది. పీడీపీ మూడు స్థానాలకు పరిమితమైంది. 10 స్థానాల్లో ఇతరులు గెలుపొందారు. అందులో ఒకరు ఆప్ అభ్యర్థి ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దు, కేంద్ర పాలిత ప్రాంతంగా మార్పు వంటి నిర్ణయాల నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో జమ్ముకశ్మీర్ ప్రజలు ఎన్‌సీ–కాంగ్రెస్ కూటమివైపే మొగ్గు చూపారు. పూర్తిస్థాయి రాష్ట్ర హోదా సాధనకు కృషి చేస్తామన్న వాగ్దానాన్ని నమ్మి– ఆ రెండు పార్టీలకే పట్టం కట్టారు. పీడీపీ కూడా ఇలాంటి హామీలే ఇచ్చినా– గతంలో బీజేపీతో జట్టు కట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో ఆ పార్టీని నమ్మలేదు. చరిత్రలో తొలిసారి జమ్ముకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో గెలుపొందింది ఆప్ దోడా నియోజకవర్గం నుంచి ఆప్ టికెట్‌పై పోటీ చేసిన మెహ్రాజ్ మాలిక్– బీజేపీ అభ్యర్థిపై గజయ్ సింగ్ రాణాపై 4,538 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. మొత్తానికి జమ్ముకశ్మీర్‌లో హంగ్ ఏర్పడుతుందని ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు వేయగా, అందుకు భిన్నంగా ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి.

## ప్రజల తీర్పు అద్భుతం..

**-మాజీ మంత్రి హరీశ్ రావు**



జనపదం, సిద్దిపేట: హర్యానా ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ గ్యారెంటీల గారడీని హర్యానా ప్రజలు విశ్వసించలేదని ఫలితాలు తేల్చి చెబుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ చేసిన మోసాన్ని హర్యానా ప్రజలు నిశితంగా గమనించారు. ఆ ప్రభావం ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనబడిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ఫలితాలు చూసిన తర్వాత అయినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ప్రతీకార రాజకీయాలు, దృష్టి మళ్లింపు రాజకీయాలు మానుకొని, ఆరు గ్యారెంటీలను, 420 హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కశ్మీర్‌లో బీజేపీని విశ్వసించలేదు.. హర్యానాలో కాంగ్రెస్‌ను విశ్వసించలేదు. రెండు జాతీయ పార్టీల పట్ల ప్రజల్లో విముఖత ఉన్నదనేది సుస్పష్టం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కొత్త పంతుళ్లొస్తున్నారు..

- 10,006 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక
- నియాక పత్రాలు అందజేయనున్న సీఎం
- ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు చేసిన అధికారులు

**జనపదం, ఎడ్యుకేషన్:** తెలంగాణలో 2024 డీఎస్సీ ద్వారా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు బుధవారం నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లాల వారీగా డీఎస్సీ పోస్టుల వివరాలను విద్యా శాఖ మంగళవారం వెల్లడించింది. మొత్తం 11,162 పోస్టులకు గానూ.. 10,006 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినట్టు విద్యా శాఖ తెలిపింది. మిగిలిన1056 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పెండింగ్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. 1056 పోస్టుల్లో సెలక్ట్ అయిన అభ్యర్థులు కోర్టు కేసులు, వివిధ కారణాల వల్ల పెండింగ్ లో ఉన్నారు.



### ఎల్బీ స్టేడియంలో..

హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నియామక పత్రాలను అందజేయనున్నట్లు సీఎస్ శాంతికుమారి వెల్లడించారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ఆదివారం సీఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. సుమారు పది వేల మందికి పైగా ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక పత్రాలను జారీ చేయనున్నారు. ఇప్పటికే ఎంపికైన వారి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టర్లు పూర్తిచేశారు. బుధవారం 9 మధ్యాహ్నం 2 గంటల లోపు ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులందరు ఎల్‌బీ స్టేడియంకు చేరేలా ప్రత్యేక బస్సులను ఏర్పాట్లు చేశారు. ప్రతి బస్సులో ఒక పోలీస్ కానిస్టేబుల్, సమన్వయ అధికారిని నియమించాలని సీఎస్ ఆదేశించారు. జిల్లాల నుంచి వచ్చే బస్సులకు సమీపంలోనే పార్కింగ్ సదుపాయం కల్పించారు.

### 1:1 నిష్పత్తిలో జాబితా

ఈ డీఎస్సీలో అభ్యరులు స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ), సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టుల్లో ఏదో ఒక దానికే ఎంపికయ్యేలా పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇటీవల డీఎస్సీ ఫలితాలు వెల్లడి కాగా వందల మంది అభ్యరులు రెండు, మూడు పోస్టులకు ఎంపికవుతున్న పరిస్థితి నెలకొంది. వారు ఏదైనా ఒక దాంట్లో చేరితే మళ్లీ వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉంటాయి. ఈ పరిస్థిని నివారించేందుకు తొలుత ఎస్‌ఏ విభాగంలో 1:1 నిష్పత్తిలో జాబితా విడుదల చేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఎస్‌జీటీకి ఎంపికైన వారి లిస్ట్ విడుదల చేస్తామన్నారు.



**జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా**

జమ్ము కశ్మీర్ లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ – కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం కొలువుదీరనుంది. ఈ నేపథ్యంలో జమ్ము కశ్మీర్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి ఎవరన్నది నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా తాజాగా ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో కూటమి విజయం దిశగా దూసుకెళ్తున్న నేపథ్యంలో ఫరూఖ్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడారు. తదుపరి ముఖ్యమంత్రి తన కుమారుడు ఒమర్ అబ్దుల్లా అని స్పష్టం చేశారు. కాగా, ఒమర్ అబ్దుల్లా ఇప్పటికే జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రిగా చేసిన విషయం తెలిసిందే.

## బీజేపీలో జోష్..

**జనపదం, ఢిల్లీ:** హర్యానా, జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీజేపీలో కొత్త జోష్‌ను నింపాయి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ గతంలో కంటే మెరుగైన ఫలితాలను కమలదళం సాధించింది. త్వరలో జరగనున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతోంది. హరియాణాలో విజయంతో 2029 సార్వత్రిక ఎన్నికల సన్నాహాలను ఉత్సాహంగా ప్రారంభించాలన్న ఇండియా కూటమి ఆశలపై బీజేపీ నీళ్లు చల్లినట్లయింది. లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా మెజార్టీ మార్క్ చేరుకోలేక మిత్రపక్షాల సాయంతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన భారతీయ జనతాపార్టీకి హర్యానా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఈ రెండు చోట్ల కాషాయ దళం అంచనాలకు మించి రాణించింది. ముఖ్యంగా హిందీ హార్ట్‌ల్యాండ్‌కు తాళంగా భావించే హర్యానాలో పట్టు నిలుపుకోవడం కమలం పార్టీకి కొండంత బలాన్ని ఇచ్చింది. ఇప్పటికే హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ పాలనలో ఉండగా హర్యానాను కూడా కోల్పోతే ఆ ప్రభావం మిగిలిన వాటిపై పడుతుందని ప్రతిపక్షాలు ఆశలు పెట్టుకొన్నాయి. కానీ, ఈ విజయంతో బీజేపీ ఖాతాలోకి 13వ రాష్ట్రం చేరినట్లైంది.

### ఎన్‌సీ కంటే బీజేపీకే ఎక్కువ

మరోవైపు జమ్ముకశ్మీర్‌లోనూ బీజేపీ బలమైన శక్తిగానే ఆవిర్భవించింది. 2014 జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో 25 సీట్లకే పరిమితమైన కమలదళం ఈ సారి 29 స్థానాలను తన ఖాతాలో వేసుకొంది. సీట్ల పరంగా నేషనల్ కాన్ఫరెన్స్ తర్వాత అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. ఓటింగ్ శాతం పరంగా చూస్తే నేషనల్ కాన్ఫరెన్స్ కంటే బీజేపీకే ఎక్కువ ఓట్లు వచ్చాయి. గవర్నర్ నామినేట్ చేసే ఐదుగురు సభ్యుల మద్దతు బీజేపీకి దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఎన్నికల్లో పొత్తులు లేకపోయినా, భవిష్యత్తులో జమ్ము ప్రాంతంలో విస్తరించాలని భావించే పార్టీలు కచ్చితంగా బీజేపీ జట్టుకట్టే అవకాశం ఉంటుంది. నియోజకవర్గాల పునర్విభజనలో జమ్ము ప్రాంతానికి ప్రాధాన్యం పెంచడం బీజేపీకి కలిసొచ్చిన అంశం. దీనికి తోడు ఎల్‌జీ పాలనలో వేర్పాటువాదులను బలంగా అణచివేయడం వల్ల కశ్మీర్‌తో పోలిస్తే ప్రశాంతంగా ఉండే జమ్ములో బీజేపీ ఇమేజ్ బలపడింది. కశ్మీర్ కేంద్రంగా పనిచేసే ఎన్‌సీ, పీడీపీ వంటి పార్టీలు జమ్ముకు ప్రాధాన్యం ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది.






**వినేష్ ఫోగట్ విజయం..**

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జులనా స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి, ప్రముఖ రెజ్లర్ వినేష్ ఫోగట్ విజయం సాధించారు. వినేష్ ఫోగట్ తన సమీప ప్రత్యర్థిపై 6,015 ఓట్ల తేడాతో గెలుపొందారు. వినేశ్‌కు మొత్తం 65,080 ఓట్లు రాగా.. తన సమీప ప్రత్యర్థి యోగేశ్ కుమార్‌కు 59,065 ఓట్లు వచ్చాయి. గెలుపు అనంతరం తన విజయంపై వినేశ్ ఫోగట్ మొదటిసారి స్పందించారు. 'ఇది ఎల్లప్పుడూ దేశంలో పోరాట మార్గాన్ని ఎంచుకునే ప్రతి అమ్మాయి గెలుపు. మహిళల పోరాటం వృథా కాదు. సత్యమే గెలిచింది. ఈ దేశం నాకిచ్చిన ప్రేమను నేను ఎప్పటికీ నిలబెట్టుకుంటాను' అని అన్నారు.

## ఈవీఎంల్లో అవకతవకలు



**జనపదం, ఢిల్లీ:** హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కాగా.. 9 గంటలకల్లా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లలో ఆధిక్యంలో నిలిచింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో సంబురాలు మొదలయ్యాయి. అయితే గంటలోపే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 10 గంటల కల్లా బీజేపీ అనూహ్యంగా ఆధిక్యంలోకి వచ్చేయడం, ఆ తర్వాత తుది ఫలితాల్లోనూ బీజేపీ ఘన విజయం సాధించడం జరిగిపోయాయి. దీనిపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అనుమానం వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, జైరాం రమేశ్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి ఎన్నికల ఫలితాలపై మాట్లాడారు. హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను తాము అంగీకరించడం లేదని వారు తేల్చిచెప్పారు. ఈవీఎంలలో అవకతవకలు జరిగాయని, ప్రజల అభీష్టాన్ని బీజేపీ తారుమారు చేసిందని ఆరోపించారు. మధ్యాహ్నం వరకు తాను ఈసీతో టచ్‌లో ఉంటూ మూడు జిల్లాల్లోని ఈవీఎంలపై ఫిర్యాదు చేసినట్లు జైరామ్ రమేశ్ తెలిపారు. హర్యానాలో ఫలితాలు పూర్తిగా అనూహ్యంగా, ఆశ్చర్యకరంగా ఉన్నాయని రమేష్ వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయి పరిస్థితికి ఇవి పూర్తి విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఇది ప్రజాభీష్టాన్ని తారుమారు చేయడమేనని, ప్రజాస్వామ్య ప్రక్రియను నాశనం చేయడమేనని విమర్శించారు. ఉదయమే ఈసీ వెబ్ సైట్లో ఫలితాల సరళి అప్‌డేట్ సరిగా జరగడం లేదంటూ జైరామ్ రమేశ్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఈసీ.. కాంగ్రెస్ ఆరోపణలు బాధ్యతారాహిత్యం అని పేర్కొంది. మరో కాంగ్రెస్ నేత పవన్ ఖేరా కూడా హర్యానా ఫలితాలు అనూహ్యంగా ఉన్నాయని అన్నారు.



## గల్ఫ్ మృతుల కోసం రూ.10.60 కోట్లు

### జీవో ప్రతులను విడుదల చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

**జనపదం, హైదరాబాద్:** గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపు మార్గదర్శకాల జీవో ప్రతులను బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సచివాలయంలో టీపీసీసీ ఎన్నారై సెల్ నేతలు డా. బిఎం వినోద్ కుమార్, మంద భీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాస్ రావ్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై అధికారి ఇ. చిట్టిబాబు ఉన్నారు. గల్ఫ్ మృతుల వారసులకు ఎక్స్ గ్రేషియా (మృతధన సహాయం) చెల్లింపుకు ప్రభుత్వం రూ.10 కోట్ల 60 లక్షలు కేటాయించిందని, జిల్లా కలెక్టర్ల ద్వారా చెల్లింపులు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన గల్ఫ్ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసిందని అన్నారు. మంత్రి పొన్నం చొరవ తీసుకొని గల్ఫ్ సంక్షేమ జీవోల విడుదలకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపు ఏ రాష్ట్రంలో లేదని, ఇది దేశ చరిత్రలోనే ప్రథమం అని వినోద్ అన్నారు.

## పెండింగ్ బిల్లులు క్లియరెన్స్.. దసరా లోపే..

- నాణ్యమైన విద్యకు తెలంగాణను మోడల్ గా నిలుపుతాం
- మూసీని ప్రక్షాళన చేస్తే తప్పేంటి..?
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**జనపదం, బ్యూరో:** 'గత ప్రభుత్వ నిర్వాకంతో సంక్షేమ రంగం కుప్పకూలింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యాసంస్థల పెండింగ్ బిల్లుల కోసం రూ.114 కోట్లు విడుదల చేశాం. పెండింగ్ బిల్లులు ప్రతినెల 50 శాతం చొప్పున మంజూరు చేస్తూ షాచురేషన్ పద్ధతిన ముందుకు వెళ్తాం. అత్యంత పేద, కిందిస్థాయి వారికి రెగ్యులర్ ఉద్యోగులతో పాటు నెల వారీగా వేతనాలు చెల్లించేలా దసరా పండగలోపే ఏర్పాట్లు చేస్తున్నాం' అని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కావాల్సినన్ని ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోపే ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేస్తామన్నారు. రెవెన్యూ రికార్డుల అప్డేషన్ పేరుతో గత పాలకులు బినామీల పేరిట భూములను బదలాయించారని చెప్పారు. తాము ఆక్రమణలకు గురైన చెరువులను ప్రజలకు ఇవ్వాలనుకుంటున్నామని, గత ప్రభుత్వంలో కేసీఆర్ ఒక్కడే నిర్ణయాలు తీసుకునేవాడు కేబినెట్ లో మాట్లాడే అవకాశం ఉండేది కాదన్నారు. అందుకే మూసీ అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి కెబినెట్లో చర్చించారా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా అన్నట్లు ఉందని, ఆయన నిత్యం అబద్ధాలు ఆడతారని అందుకే ఎదుటివారు ఏది మాట్లాడినా ఆయనకు అబద్ధం మాట్లాడినట్టే అనిపిస్తుందని డిప్యూటీ సీఎం మండిపడ్డారు. మాది పూర్తి ప్రజాస్వామ్య కేబినెట్ ప్రతి అంశం పైన అందరూ మాట్లాడుతారని పేర్కొన్నారు. నదులను పెట్టుబడులుగా మార్చుకొని ఇతర దేశాలు ఆదాయం సమకూర్చుకుంటున్నాయన్నారు. హైదరాబాదులో ప్రకృతి పరంగా మనకు మూసీ నది ఉందని, అందులో మంచినీరు పారించి, పార్కులు నిర్మించి, ఆ ప్రాంతంలోని నిరాశ్రయులకు అక్కడే ఇల్లు నిర్మిస్తామని చెప్పారు. మంచి వాతావరణంలో మూసీ వాసులను ఉంచితే ఈ రాష్ట్రంలోని ప్రతిపక్షాలకు వచ్చిన నష్టం ఏంటని ప్రశ్నించారు. వాళ్లు పాలరాతి భవనంలో ఉండాలి.. మూసీ ప్రాంతంలోని నివసించేవారు మురికి కూపం లో ఉండాలా అన్నారు. మేం గత పాలకుల లాగా ఎవరినీ కలవకుండా గడిల్లో.. ద్వారాలు మూసుకొని ఉండలేదన్నారు. ఇక విద్యా రంగంలో దేశానికి తెలంగాణ ఒక మోడల్ గా నిలవబోతుందని డిప్యూటీ సీఎం అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా, అన్ని రకాల వసతులతో 5వేల కోట్లతో ఈ ఏడాది ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం ప్రారంభిస్తున్నామని, ఈనెల 11న రాష్ట్రవ్యాప్తంగా భూమి పూజలు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా అధికారులు ప్రతి 15 రోజులకు ఒకసారి సంక్షేమ వసతి గృహాల్లో రాత్రి బస చేయాలన్నారు. త్వరలో సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని చెప్పారు.

## నేడు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

### పిలుపునిచ్చిన మంద కృష్ణ మాదిగ



**జనపదం, హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిరసనలకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ప్రభుత్వ ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మందకృష్ణ ప్రశ్నించారు. వర్గీకరణ చేయకుండానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రాల్లో రేపు భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించి, ధర్నా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రాల్లోని అంబేద్కర్ విగ్రహాల నుంచి కలెక్టరేట్ల వరకు ర్యాలీలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు అందించాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో ట్యాంక్ బండ్ నుంచి బషీర్‌బాగ్ వరకు ర్యాలీ తీయనున్నట్లు మందకృష్ణ మాదిగ తెలిపారు. రేవంత్ సర్కార్ తమకు నమ్మక ద్రోహం చేసిందని మందకృష్ణ ధ్వజమెత్తారు. మాదిగలకు సీట్లు తగ్గడానికి కూడా రేవంత్ రెడ్డినే కారణం అన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారు. అసెంబ్లీలో ప్రకటించిన మాదిరిగా.. రేవంత్ రెడ్డి అన్ని ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు.



## పార్లమెంట్ ఆఫీసెస్ ప్రాఫిట్ కమిటీ చైర్మన్‌గా ఈటల

**జనపదం, ఢిల్లీ:** పార్లమెంట్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్ జాయింట్ కమిటీ చైర్మన్‌గా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి

### నిర్ణయించిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ..

**జనపదం, బ్యూరో:** వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి 2025 మార్చిలో జరగనున్న ఎన్నికల్లో ప్రస్తుత శాసన మండలి సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డినే మరోమారు నిలపాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్( టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జంగయ్య అధ్యక్షతన వర్చువల్ గా జరిగింది. నర్సిరెడ్డి గత ఐదున్నరేళ్లుగా మండలి సభ్యునిగా విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రశంసనీయమైన కృషి చేశారు. వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలతో పాటు వివిధ వర్గాల ప్రజాసమస్యలను కౌన్సిల్ లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా మరొకమారు శాసన మండలి అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులు రాములు, దుర్గాభవాని, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## డిజిటల్ క్రాప్ సర్వేకు గ్రీన్ సిగ్నల్..

### ఒప్పుకున్న ఏఈఓలు

### ఫలించిన ఉద్యోగుల జేఏసీ చొరవ



**జనపదం, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేకు అడ్డంకులు తొలగిపోయాయి. ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ అమలు చేసేందుకు ఏఈఓలు అంగీకరించారు. బుధవారం నుంచే సర్వే ప్రక్రియ ప్రారంభం కానుంది. సర్వే అమలుపరిచే ప్రక్రియలో కలిగే ఇబ్బందులపై పది రోజుల నుంచి సర్వేను చేపట్టకుండా ఏఈఓ లు నిరసన చేస్తున్న విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని తెలంగాణ వ్యవసాయ అధికారుల జేఏసీ సంఘాల నాయకులు తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, నాయకుడు కె.రామకృష్ణ దృష్టికి తెచ్చారు. సమస్య పరిష్కారానికి జేఏసీ నాయకులు ప్రత్యేక చొరవ చూపారు. తెలంగాణ వ్యవసాయ అధికారుల జేఏసీ సంఘాల నాయకులతో లచ్చిరెడ్డి, రామకృష్ణ మంగళవారం చర్చలు జరిపారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ అధికారుల జేఏసీ సంఘాల నాయకులను లచ్చిరెడ్డి, రామకృష్ణ తీసుకొని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి మరియు ఏపీసీ రఘునందన్‌రావు దగ్గరకు తీసుకెళ్లారు. సర్వేతో ఎదురయ్యే ఇబ్బందులను, ఏఈఓలు సర్వే ప్రక్రియకు ఎందుకు దూరంగా ఉంటున్నారనే విషయాలను వివరించారు. దీంతో అన్ని అంశాలపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు సానుకూలంగా స్పందించారు. డిపార్ట్ మెంట్ పెద్దగా తానున్నానని చెప్పారు. యాప్ డౌన్లోడ్ చేసుకొని సర్వే స్టార్ట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల జేఏసీ సంఘాల నాయకులు తెలంగాణ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు వైద్యనాథం, శశిధర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం నాయకుడు వై.శ్రావణ్‌కుమార, తెలంగాణ వ్యవసాయ వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం నాయకుడు సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తుంగభద్రలో నీటి దొంగలు

- ఏపీ, కర్ణాటక రాష్ట్రాల తెగింపు
- తుంగభద్రపై మరో ప్రాజెక్టుకు సన్నాహాలు
- మంత్రాలయం దగ్గర నిర్మాణం
- ఇప్పటికే ప్రతిపాదనలు పూర్తి
- కృష్ణా బోర్డుకు తెలియకుండానే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం
- ఏపీలోని కర్నూల్, కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలకు నీరు
- ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తి చేసిన ఇరు రాష్ట్రాలు
- సర్కారు ముందుకు కొత్త సవాల్



**జనపదం, బ్యూరో :** తుంగభద్ర నదిలో దొంగలు పడ్డారు. ఇన్నాళ్లూ రెండు తెలుగు రాష్ట్రాలకు సమాన నీటి హక్కు కలిగిన ఆ నది నుంచి పొరుగు రాష్ట్రాలు ఏపీ, కర్ణాటక అక్రమ నీటి చౌర్యానికి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నాయి. ఆ నదిపై మరో సాగునీటి ప్రాజెక్టును నిర్మించి భారీ జల దోపిడికి స్కెచ్ వేశాయి. ఇప్పటికే రాష్ట్ర పునర్విభజన తర్వాత విభజన హామీల పరిష్కారం నోచుకోని ఏపీ, తెలంగాణ నీళ్ల కోసం కొట్లాడుతున్న విషయం తెలిసిందే. ఆ సమస్య ఇంకా పరిష్కారానికి నోచుకోకముందే రాష్ట్ర సర్కార్ ముందు ఈ కొత్త సవాల్ వచ్చి పడింది. తుంగభద్ర నదిపై మరో డ్యాం నిర్మాణంతో ప్రస్తుతం నీటివాటా కోసం ఏపీతో కొట్లాడుతున్న తెలంగాణ ఇకపై కర్ణాటకతోనూ కొట్టాడాల్సిన పరిస్థితి రాబోతున్నది. ఇప్పటికే కృష్ణా, గోదావరి బేసిన్ పరిధుల్లోని ప్రాజెక్టులకు సంబంధించిన నీటివాటా వివాదం రాజుకుంటున్న నేపథ్యంలో పొరుగు రాష్ట్రాలు ఏపీ..కర్ణాటక కృష్ణానదికి ప్రధాన ఉపనదిగా ఉన్నతుంగభద్ర నదిపై మరో సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి వేగంగా పావులు కదపడం తీవ్ర చర్చకు దారితీసింది. ఇప్పటికే నూతన ప్రాజెక్టు నిర్మాణానికి నిర్ణయం తీసుకున్న ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు తమ రాష్ట్రాల సరిహద్దుల్లో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖల అధికారుల మధ్యన ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయి. ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా మంత్రాలయం నుంచి పంచముఖి వెళ్లే మార్గంపై రాకపోకలు సాగేందుకు వీలుగా కూడా ఈ ప్రాజెక్టును ఉపయోగించనున్నారు. బ్రిడ్జి కం రిజర్వాయర్‌గా ఈ ప్రాజెక్టు ను నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధం చేయాలని నిర్ణయించారు.

**తెగని పాత లొల్లి..**

కృష్ణా నది బేసిన్ పరిధిలో మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. అయితే కృష్ణా నదీ జలాలను ఉపయోగించుకోవాలంటే బేసిన్ ప రిధిలో ఉన్న ఈ నాలుగు రాష్ట్రాల భాగస్వామ్యంతోనే నిర్ణయాలు జరగాల్సి ఉంది. ఉమ్మడి ఏపీ రాష్ట్రం విడిపోయాక కృష్ణా నదీ జలాలకు సబంధించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నీటివాటాలపై ఇప్పటికే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో వాదనలు నడుస్తున్నాయి. రెండు రాష్ట్రాల మధ్య నీటి వినియోగంపై సమన్వయం నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం కృష్ణానదీ యాజమాన్య బోర్డును నియమించింది. కృష్ణా నది ప రీవాహకంగా ఉన్న ప్రాంతంలో తుంగభద్ర నదిపై ఏ కొత్త ప్రాజెక్టు నిర్మించాలన్న తొలుత కృష్ణాబోర్డులో ప్రతిపాదించాల్సి ఉంది. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయం ద్వారానే ఏ ప్రాజెక్టుకైనా అనుమతి పొందాల్సి ఉంది. అంతేకాకుండా కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి అధ్యక్షతన తెలంగాణ, ఆంధప్రదేశ్ రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా ఉన్న అపెక్స్ కౌన్సిల్‌లో కూడా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇవేవి లేకుండానే తెలంగాణ రాష్ట్రంతో నామమాత్రంగానైనా చర్చించకుండా, కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు ముం దుకుపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణంతో తుంగభద్ర నదిలో జల దోపిడికి సిద్ధమవుతున్నాయి. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ మంత్రి బోసరాజు, రాయచూర్ ఎంపీ కుమార్ నాయక్, కర్నూలు జిల్లా ఎంపీ పంచలింగాల నాగరాజుతోపాటు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖల అధికారుల మధ్య మంత్రాలయంలో చర్చలు జరిగాయి. తుంగభద్ర నదీ జాలను రెండు రాష్ట్రాల్లోని కర్నూలు, రాయచూర్ జిల్లాల్లో ఉపయోగించుకునేందుకు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నారు. నదిలో బ్రిడ్జి కం రిజర్వాయర్ నిర్మించడం ద్వారా ఎన్ని టీఎంసీల నీటిని నిలువ చేసుకునే అవకాశాలు ఉన్నాయి, రెండు రోర్‌ష్ట్రాల్లో ఎన్ని లక్షల ఎకరాలకు సాగనీటిని అందించే వీలుంది తదితర వివరాలపై సమగ్ర సర్వే నిర్వహించనున్నారు.

**తెలంగాణ ప్రాజెక్టులపై ప్రభావం..**

తుంగభద్ర నదిపై మంత్రాలయం వద్ద బ్రిడ్జి కం బ్యారేజి నిర్మాణం వల్ల ఆ ప్రభావం తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టులపై పడనుంది. కృష్ణాపై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టులుగా ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు కృష్ణానది తర్వాత దాదాపు తుంగభద్ర నదినుంచే అధికంగా నీటి లభ్యత ఉంటుంది. కృష్ణానది బేసిన్ పరిధిలో తెలంగాణ, ఆధ్రప్రదేశ్ రాష్ట్రాలకు జస్టిస్ బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811టీఎంసీల నీటి కేటాయింపుల్లో ఏటా 250 టీఎంసీల నుంచి 350 టీఎంసీల వరకూ తుంగభద్ర నది ద్వారానే నీటి లభ్యత ఉంటోంది. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, శ్రీశైలం ఎడమగట్టు కాలువ పథకం, నాగార్జున సాగర్ ఎడమ కాలువ తదితర వాటి ద్వారా తెలంగాణ రాష్ట్రంలో లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టులకు కేటాయింపుల మేరకు నికర జలాలు కూడా అందటం లేదు. గత ఏడాది సాగునీటి పారుదల మాట అటుంచి తాగునీటి అవసరాలకు సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కర్ణాటక ప్రభుత్వాన్ని బతిమాలుకోవాల్సివచ్చింది. ఈ పరిస్థితుల్లో తెలంగాణకు ఎగువన ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలు తుంగభద్ర పై మరో కొత్త ప్రాజెక్టు నిర్మా ణం చేపడితే ప్రభావం తెలంగాణ రాష్ట్ర రైతాంగం పైనే కాకుండా తాగునీటికోసం అన్ని వర్గాల ప్రజలపైన పడనుంది.



## మహిళలకు మరో శుభవార్త..

### మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

- కసరత్తు ముమ్మరం చేసిన ప్రభుత్వం
- మంత్రుల ఆధ్వర్యంలో కీలక చర్చలు
- డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు

**జనపదం, బ్యూరో** : మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వారి ద్వారా బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ వస్తున్న నేపథ్యంలో మహిళా సంఘాలకు ఉపాధి కల్పిస్తూ వారి ద్వారా కొనుగోలు చేసిన బస్సులను హైర్ చేసుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని నిర్ణయించింది. మంగళవారం సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో రవాణా శాఖ, పీఆర్ ఆర్డీ ఉన్నాధికారుల సమావేశం జరిగింది. మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల కేటాయింపు విధి విధానాలపై చర్చలు జరిపారు. రవాణా శాఖ స్పెషల్ సెక్రటరి వికాస్ రాజ్, కమిషనర్ ఇలంబర్తి, పీఆర్ ఆర్ డీ సెక్రటరి లోకేష్ కుమార్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, టీజీ ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. మొదటి విడతలో ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని నిర్ణయించారు. సీఎం సొంత జిల్లా మహబూబ్ నగర్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత జిల్లా కరీంనగర్ లను ఎంపిక చేశారు. మొదటి విడతలో 100 నుంచి 150 బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మహిళా సంఘాలు కొనుగోలు చేసే ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ బాధ్యతల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయం, నిర్వహణ ఖర్చు తదితర అంశాలన్నింటితో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.



## భయాందోళనకు గురికావొద్దు..

### మూసీ బాధితులకు మధుయాష్కి భరోసా

**జనపదం, హైదరాబాద్ :** మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, మధుయాష్కి గౌడ్ భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తాతో కలిసి ఆయన ఫణిగిరి కాలనీ శ్రీ వెంకట సాయి నగర్, న్యూ మారుతి నగర్ నార్త్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మధు యాష్కి గౌడ్ మాట్లాడుతూ మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావొద్దని, నిశ్చింతగా ఉండాలని సూచించారు. సీఎం, డిప్యూటీ సీఎం తో ఈ ప్రాంత ప్రజలతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయించి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మూసీ ప్రాంత ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, ఈ విషయంలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ఉంటుందని స్పష్టం చేశారు.

## జమ్మును అభివృద్ధి చేస్తాం..

- గతంలో కంటే అత్యధిక స్థానాలు గెలిచాం.
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్ :** జమ్మూ ప్రాం తంలో బీజేపీ విజయం చారిత్రాత్మకమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొ న్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు, ఓట్లు పొందామని వెల్లడించారు. జమ్ముకశ్మీర్ ఎన్నికల ఫలితాలపై ఆయన మాట్లాడారు. జమ్మూ ప్రజలు మాతో ఉన్నారని మరోసారి నిరూపితమైందని చెప్పారు. కాం గ్రెస్ ముక్త జమ్మూకాశ్మీర్ సాధనలో మేం విజయం సాధించామన్నారు. కేంద్ర పార్టీ నాయకత్వ మార్గదర్శనంలో.. జ మ్మూకశ్మీర్ రాష్ట్ర నాయకులు ఐకమత్యంతో అన్ని స్థాయిల్లో కష్టపడి పని చేశారన్నారు. అసెంబ్లీలో గతంలో ఎప్పుడు కూడా సంపాదించనన్ని ఎక్కువ సీట్లలో బీజేపీ ఈ ఎన్నికల్లో విజ యం సాధించిందని, ఇకపై జమ్మూకాశ్మీర్ అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి మరింత కష్టపడి పనిచేస్తామన్నారు ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ప్రధాని ఆత్మవిశ్వాసాన్ని తగ్గించామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు ప్రజలే సరైన సమాధానం ఇచ్చారన్నారు. మోడీపై ప్రజలకున్న విశ్వాసమేంటో.. జమ్మూకాశ్మీర్, హర్యానా ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. జమ్మూ ప్రాంతంలోని 43 అసెంబ్లీ స్థానాల్లో, బీజేపీ 29 స్థానాలను కమలం గెలుచుకుందన్నారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ కేవలం ఒక్క సీటు మాత్రమే గెలిచిందని ఆయన ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ముక్త జమ్మూను ప్రజలు ఈ ఎన్నికల ద్వారా మరొకసారి నిరూపించారన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి..

- తీవ్ర ఆందోళనలో విద్యార్థులు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



**జనపదం, హైదరాబాద్** : ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయకుండా, సుమారు 13 లక్షల మంది విద్యార్థుల జీవితాలను కాంగ్రెస్ ప్రభుత్వం అగమ్య గోచరంగా మార్చిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించకపోవడంతో టీసీ, ఇతర సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోయే పరిస్థితి వచ్చిందని, తద్వారా విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. మంగళవారం తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు మాజీ మంత్రి హరీష్ రావును కలిసి తమ కష్టాలు చెపుకొని ఆవేదన చెందారు. జు రీయింబర్స్ మెంట్ బిల్లులు రాకపోవడంతో దసరా, దీపావళి వేళ సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేక పోతున్నామని వాపోయారు. భవనాల అద్దెలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు వడ్డీలు కట్టలేక, కొత్త అప్పులు దొరకక కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని మండిపడ్డారు. విద్యా వ్యవస్థ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి ఇంతకు మించిన ఉదాహరణ లేదన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.19 వేల కోట్లను ఫీజు రియంబర్స్మెంట్ కోసం విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రతి ఏడాది సగటున క్రమం తప్పకుండా రెండు వేల కోట్లు విడుదల చేసిందని, కరోనా వంటి సంక్షోభ సమయంలోనూ విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల్లో ఒక్క రూపాయి విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కాగా, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించేలా ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ఈ విషయంలో బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

## ఎవరైనా రూల్స్ పాటించాల్సిందే..

- రవాణా శాఖలో సంస్కరణలు
- 'సారథి'జాబితాలో తెలంగాణ
- ఇకపై స్క్రాపింగ్ పాలసీ
- కర్ణాటక, మహారాష్ట్రల్లో పాలసీల అమలుపై అధ్యయనం చేసి నిర్ణయం
- ఇప్పటికే సారథి జాబితాలో 28 రాష్ట్రాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**జనపదం, హైదరాబాద్** : తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖలో కీలక మార్పులు తీసుకొస్తున్నామని, ఎవరైనా రూల్స్ పాటించాల్సిందేని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ మోటారు వాహన చట్టంలో భాగంగా దేశంలో 28 రాష్ట్రాలు ఇప్పటికే సారథి వాహన్ పోర్టల్ అమలు చేస్తున్నాయన్నారు. ఇంటర్ స్టేట్ రిలేషన్స్‌కు ఇబ్బంది వస్తుండడంతో క్షేత్ర స్థాయిలో ఆర్టీవో డీటీవోలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ కూడా సారథి ఈ వాహన పోర్టల్‌లో చేరుతున్నట్లు చెప్పారు. జీవో 28 ద్వారా ఇది అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో, దేశంలో వాహనాలకు సంబంధించి 15 సంవత్సరాలు మనం వాడే వాహనాలు, 8 సంవత్సరాలు ప్రైవేట్ వాహనాలు స్క్రాపింగ్ పాలసీ తీసుకువచ్చామన్నారు. అయితే సారథి పాలసీ అమలుపై మంచి నిర్ణయం తీసుకున్నామని చెప్పిన మంత్రి.. కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అమలవుతున్న పాలసీలు అధ్యయనం చేశామన్నారు. తర్వాతే ఇక్కడ అమలు చేసే దానిపై జీవో తీసుకొచ్చామని వివరించారు. వాహనాల చెకింగ్‌కు సరైన విధానం అమలు జరగడం లేదని కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో సెంటర్‌కు రూ.8 కోట్లు ఖర్చు అవుతుందన్న పొన్నం రాష్ట్రంలో మొత్తం32 సెంటర్లు తీసుకొస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఏడాదికి 1.60లక్ష మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక నిబంధనలు తీసుకొస్తున్నామన్నారు. రోడ్డు భద్రతపై యునిసెఫ్ సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చే నెలలో రోడ్డు సేఫ్టీ మంత్ ఉందని.. సిగ్నల్, జీబ్రా క్రాసింగ్ తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి నియమ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు 8 వేల లైసెన్స్2లు రద్దు చేసినట్లు పొన్నం ప్రభాకర్ వివరించారు.

**నిబంధనలు అందరికీ ఒక్కటే..**

రోడ్డు, ప్రాణ భద్రత విషయంలో సుప్రీం కోర్టు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే డ్రైవింగ్ లైసెన్స్ పొందే అవకాశం ఉండదన్న ఆయన వాహనాలు కొనుక్కున్నా... వారి పేరు మీద నమోదు చేసుకునే అవకాశం ఉండదన్నారు. ప్రాణ నష్టాన్ని అవేర్నెస్ క్రియేట్ చేయడం చిన్న పిల్లల స్థాయి నుంచి ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటామనీ ప్రభుత్వ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ వాహనాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. కొత్తగా 113 మంది వెహికిల్ ఇన్స్పెక్టర్లు నియామకాలు పూర్తి చేసుకొని విధుల్లోకి రాబోతున్నారన్నారు.. వారిని మరింతగా ఉపయోగించుకుంటామని చెప్పారు. ఆర్టీసీలో ఎంవీఐ రూల్స్ అమలు అవుతున్నాయన్న పొన్నం ఎక్కడ ఇబ్బంది లేదన్నారు. జీహెచ్ఎంసీలో ఉన్న వాహనాలు అయినా ఏదైనా రూల్స్ పాటించాల్సిందేనని తేల్చి చెప్పారు. ప్రభుత్వ వాహనాలకు కూడా నిబంధనలు వర్తిస్తాయన్నారు. ఇరు రాష్ట్రాలకు సంబంధించిన రవాణా శాఖ అంశాలు ఇరు రాష్ట్రాల అధికారులు చర్చిస్తారన్నారు.



## సచివాలయంలో బతుకమ్మ సంబురం

- హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి
- ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ

**జనపదం, సెక్రటేరియట్ :** ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ముఖ్య అతిథిగా హాజరు కాగా, ఉద్యోగ సంఘాల నాయకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. వేడుకల్లో సీఎస్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వాణి ప్రసాద్ హాజరై ఉద్యోగస్తులతో కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ ఉత్సవాలను సచివాలయ ప్రాంగణంలో నిర్వహించడంపై సీఎస్ ఆనందం వ్యక్తం చేశారు. ఉత్సవాల్లో సచివాలయంలోని ఉన్నతాధికారుల నుంచి అన్ని స్థాయిల్లోని మహిళా ఉద్యోగులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు, వారి పిల్లలు, చిన్నారులు అంతా ఒక చోట చేరి ఆటపాటలతో సంబురాలు జరుపుకున్నారు. దాండియా, బతుకమ్మ ఆటపాటల మధ్య జరిగిన ఈ ఉత్సవాల్లో సచివాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగుల సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## మత్స్య శాఖ అధికారులపై పోచారం ఆగ్రహం

- చేప పిల్లల సైజు తక్కువ ఉండడంతో వెనక్కి పంపాలని ఆదేశం
- బాన్సువాడలోని కల్కీ చెరువులో చేప పిల్లల పంపిణీ

**జనపదం, బాన్సువాడ :** చేప పిల్లలు చిన్న సైజులో ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి మత్స్య శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని వెంటనే వాపస్ చేయాలని, పెద్దసైజు చేప పిల్లలను తీసుకురావాలని సూచించారు. మంగళవారం ఆయన బాన్సువాడలోని కల్కీ చెరువులో జరిగిన చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం కోట్ల రూపాయలలో చేప పిల్లలను కొనుగోలు చేస్తుండగా, చిన్న సైజు పిల్లలను కొనుగోలు చేయడమేంటని ప్రశ్నించారు. ఇవి పెరగవని, సగం చనిపోతాయని అన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల చెరువుల్లో 100 శాతం సబ్సిడీపై చేప పిల్లలు పంపిణీ చేస్తోందని అన్నారు. తాను మత్స్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ పథకాన్ని ప్రారంభించామని, గొప్ప ఆలోచనతో చేసిన పథకం ఇదని, దీనికి పూర్తిగా కర్త, కర్మ, క్రియ తానేనన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇది ప్రారంభించామని అన్నారు. మధ్య దళారులు వచ్చి చేపలను తక్కువ ధరకు దోచుకుపోతున్నారని, గంగపుత్రులను మోసం చేస్తున్నారని గ్రహించి తాను ఉచిత చేప పిల్లల పంపిణీని ప్రారంభించానని అన్నారు. చేప పిల్లల పంపిణీ ప్రారంభించి 8 సంవత్సరాలు పూర్తయ్యాయని తెలిపారు. మత్స్యకారులు చేపలను విక్రయించే నిమిత్తం మోటర్ సైకిల్, తెప్పలు, వలలు, ఆటోలు ఇచ్చామని అన్నారు. మంజీరా ద్వారా వచ్చిన నీరు ఉన్నందున చిన్న చేపలు వేయకుండా, పెద్ద చేపలు వేయాలని అన్నారు. చేపలను మంచిగా కాపాడుకుంటే మత్స్యకారులు ఎంతో సంపాదించవచ్చన్నారు. ప్రకృతి సిద్ధంగా చేపలు పెరుగుతాయని, కష్టపడి చేపలు వేస్తున్నప్పుడు మీరు కూడా కష్టపడాలని అన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, అంజిరెడ్డి, ఎజాజ్, నార్ల సురేష్, దావూద్, నార్ల రవీందర్, జిల్లా మత్స్య శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణపై జోగులాంబ ఆశీస్సులు

- అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా..
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**జనపదం, అలంపూర్ :** అష్టాదశ శక్తి పీఠాల్లో ఐదో శక్తి పీఠమైన శ్రీ జోగులాంబ దేవి, శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆశీస్సులతో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, పర్యాటకంగా ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా అలంపూర్ లోని శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని మంగళవారం కొండా సురేఖ సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి దేవాలయ అర్చకులు స్వాగతం పలికారు. ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీ జోగులాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించిన తర్వాత, అర్చకులు అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం బహుకరించి ఆశీర్వాదాలు అందజేశారు. తదనంతరం మంత్రి ప్రస్తుతం జరుగుతున్న ప్రసాద్ పథకం పనులను పరిశీలించారు. పథకం ప్రణాళికను మ్యాప్‌లో చూసి, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పథకం పరిసరాలను కూడా తనిఖీ చేసి, పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృష్ణా, తుంగభద్ర నదుల కలయిక ఈ క్షేత్రానికి ప్రత్యేకతను ఇస్తుందని, అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. టెంపుల్ టూరిజం అభివృద్ధి, ఎకో టూరిజం పురావస్తు శాఖలతో సమన్వయం చేసి, ఈ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రగతిని సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రం నుండి కావాల్సిన నిధులు సమకూర్చే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకు ముందు హరిత హోటల్‌లో జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ తోట శ్రీనివాస రావు పుష్పగుచ్ఛం అందజేసి, మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో దేవాలయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఆర్డీవో రామచందర్, ఆలయ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఈవో పురేందర్, స్థానిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ అంటే పర్యాటకం..

- పెట్టుబడులకు అనువైన రాష్ట్రం
- లాస్ ఏంజెల్స్ లో మంత్రి జూపల్లి కృష్ణారావు
- రాష్ట్ర పర్యాటకంపై అంతర్జాతీయ స్థాయి ప్రచారం

జనపదం, హైదరాబాద్ : సీఎం రేంవత్ రెడ్డి ఆలోచనలు, ఘనమైన తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వం కేంద్రంగా పర్యాటకాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచస్థాయి మౌలిక వసతుల కల్పనతో ముందుకెళుతున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు, వారసత్వాన్ని కాపాడుకునేందుకు నూతన పర్యాటక విధానాన్ని రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణకు పర్యాటకులను ఆకర్శించడం, పర్యాటకుల, ప్రపంచ పెట్టుబడిదారుల గమ్యస్థానంగా తెలంగాణను ఆవిష్కరించడమే లక్ష్యంగా ఆయన అమెరికాలో పర్యటిస్తున్నారు. లాస్ ఎంజెల్స్ లోని డబుల్ ట్రీ హోటల్‌లో నిర్వహించిన తెలంగాణ టూరిజం రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు, విదేశీ ప్రతినిధులు, పర్యాటకులు, అక్కడి అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంప్రదాయం, ఆధునికత రెండింటి కలబోత తెలంగాణ అని అభివర్ణించారు. అంతర్జాతీయ పర్యాటకులకు అద్భుతమైన ఆహ్లాదాన్ని పంచే ప్రకృతి అందాలు ఉన్నాయని చెప్పారు. పర్యాటకంతో పాటు తెలంగాణలో పెరుగుతున్న పెట్టుబడుల అవకాశాలను ప్రస్తావించారు. హైదరాబాద్ నగరం దేశంలో మినీ ఇండియా గా ప్రసిద్ది పొందిందని, ఆ నగరం ప్రపంచ స్థాయి ఐటీ, ఆరోగ్య సంరక్షణ, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలకు కేంద్ర



బిందువుగా ఎదిగిందని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ గురించి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. ప్రకాష్ రెడ్డి, సాన్ ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా కాన్సుల్ జనరల్ చిట్టిరెడ్డి శ్రీపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# గోల్మాల్ గ్యారంటీలు..

**(మొదటిపేజీ తరువాయి)** ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిందు నాలుగువేల నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసింది పంటలు చేతికి వచ్చినా పంట పెట్టుబడి సహాయం అందలేదన్నారు.

అన్ని పంటలకు బోనస్ అన్న కాంగ్రెస్ బోగస్ మాటలను గ్రామాల్లో చర్చించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు కాంగ్రెస్ వచ్చాక బాగా పెరిగాయని కాంగ్రెస్ వచ్చాక బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆగమై లక్షల మంది వ్యాపారులు రోడ్డున పడ్డారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని యువత చర్చించాలని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ గ్యారంటీ అంటే గోల్డెన్ గ్యారంటీ అన్నాడు అది గోల్ మాల్, గోబెల్స్ గ్యారంటీ అని ఏద్దేవా చేశారు. రేవంత్ పరిపాలన అదుపు తప్పింది గాడి తప్పిందని, హైడ్రా వల్ల హైదరాబాద్ కల తప్పిందని, రాజకీయ భాష కట్టు తప్పిందని, అవినీతి అదుపు తప్పింది, పరిపాలన గాడితప్పింది రియల్ ఎస్టేట్ కుదేలైంది. మొత్తంగా తెలంగాణ బతుకు బండి పట్టాలు తప్పిందని విమర్శించారు. అనేకమంది ప్రజలు



ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. దిగిపోయిన ప్రజా ప్రతినిధుల జీతాలు ఇవ్వలేదు కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ పాలనలో పంచాయతీ సెక్రటరీలు అప్పుల పాలయ్యారు కానిస్టేబుల్లోకి ఇచ్చే సరెండర్ లీవ్ డబ్బులు కూడా పది నెలల నుంచి పెండింగ్లో ఉన్నాయన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో చిన్నపాటి మందులు కూడా దొరకడం లేదని ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులు నీళ్ల చారుతో అన్నం తింటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి చిరు ఉద్యోగులకు జీతాలు, పంచాయతీ సెక్రటరీల బిల్లులు, చిన్న ఉద్యోగుల జీతాలు, చిన్న కాంట్రాక్టర్స్ కి ప్రాధాన్యత క్రమంలో బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# గ్యారంటీ గారడీని జనం నమ్మలేదు..

**కర్రు కాల్చి వాతపెట్టిన ప్రజలకు జోహార్లు..**
**హర్యానా ప్రజల తీర్పు చెంపపెట్టు..**
**తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రభుత్వాల వైఫల్యాలు వెంటాడాయి..**
**అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ రాజకీయం..**
**2029 లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**జనపదం, హైదరాబాద్ సిటీ:** కర్ణాటకలో ఐదు గ్యారంటీలు, తెలంగాణలో ఆరు గ్యారంటీలు అంటూ అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్, ఏడు గ్యారెంటీల పేరిట మభ్యపెట్టాలని చూసినప్పటికీ హర్యానా ప్రజలు ఆ పార్టీకి చెంపపెట్టులాంటి తీర్పునిచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హామీల అమలులో కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని దేశం మొత్తం గమనిస్తోందని ఇందుకు ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు. అబద్ధపు హామీలతో అధికారం సాధించి ఆ తరువాత ప్రజలను వంచిస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారని తాము మొదటి నుంచి చెబుతూనే ఉన్నామని గుర్తు చేశారు. ఒక్కో రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా ఒక్కో గ్యారెంటీ పెంచుకుంటూ గారడీ చేద్దామని చూసి కాంగ్రెస్ బొక్కబోర్లా పడిందని ఎద్దేవా చేశారు. ఎన్నికలయ్యాక కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు చిత్తుకాగితంతో సమానంగా మారిపోయిందని మండిపడ్డారు.

**ఏడు గ్యారంటీలు హుష్ కాకి..**

ఏడు గ్యారంటీలు అంటూ తమ మోసాన్ని విస్తరించేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నం ఘోరంగా విఫలమైందని మంగళవారం విడుదుల చేసిన ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. అలవి కానీ హామీలతో గద్దెనెక్కాలని భావించిన కాంగ్రెస్ కు జనం కర్రు కాల్చి వాత పెట్టారన్నారు.. హర్యానా ప్రజలిచ్చిన తీర్పుతో గ్యారంటీలకు ఇక వారెంటీ లేదన్నది స్పష్టంగా తేలిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ, కర్ణాటక ప్రజలకు కాంగ్రెస్ గ్యారెంటీల డొల్లాతనం పూర్తిగా అర్థమైపోయిందని స్పష్టంచేశారు. అటు హిమాచల్ ప్రదేశ్ లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజలను నమ్మించి మోసం చేసిందని, ఆయా రాష్ట్రాల్లో పాలనాపరమైన వైఫల్యాలు కాంగ్రెస్ ఓటమికి కారణమని వెల్లడించారు. సోషల్ మీడియా విస్తృతి రోజురోజుకూ పెరిగిపోతున్న ఈ రోజుల్లో రాష్ట్రాలు వేరైనా ప్రజల నుంచి వాస్తవాలు దాచడం సాధ్యం కాదని స్పష్టంచేశారు.

**ప్రాంతీయ పార్టీలతోనే సాధ్యం..**

కాంగ్రెస్ తో హోరాహోరీ ఉన్న రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తోందని, ఆ పార్టీ ఓటమికి రాహుల్ గాంధీ బలహీనమైన నాయకత్వం కూడా ఓ ప్రధాన కారణమని ధ్వజమెత్తారు. బీజేపీని ఢీకొని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉన్నదనే విషయం ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను చూస్తే అర్థమైపోతుందన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ ఫలితాలు కూడా రెండు జాతీయ పార్టీలకు ఏమాత్రం ఆశాజనకంగా ఉండవని భావిస్తున్నట్లు కేటీఆర్ చెప్పారు. మొత్తంగా ఈ ఫలితాలను చూస్తుంటే 2029లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ లకు సాధారణ మెజార్టీ సాధ్యం కాదన్నది స్పష్టంగా అర్థమవుతోందన్నారు. బలమైన ప్రాంతీయ పార్టీలే తదుపరి కేంద్రం ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించనున్నాయన్నారు. ఈ విషయాన్ని తాము ఎప్పటి నుంచో చెబుతున్నామన్నారు. దేశంలో సమాఖ్య స్ఫూర్తిని, సమగ్రతను, సెక్యులరిజాన్ని కాపాడాలని కోరుకునే మేధావులు, ప్రజలంతా ప్రాంతీయ పార్టీలకు మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు.

**రాహుల్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి..**

హర్యానాలో కాంగ్రెస్ ఓటమితోనైనా రాహుల్ గాంధీ బుద్ధి తెచ్చుకోవాలని కేటీఆర్ సూచించారు. చెప్పే మాటలకు చేస్తున్న పనులకు పొంతన లేనప్పుడు ఇలాంటి చెంపపెట్టులాంటి ఫలితాలు తప్పవన్నారు. బుల్డోజర్ రాజ్, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగ పరిరక్షణ పేరుతో రాహుల్ గాంధీ చేసిన డ్రామాలకు హర్యానా ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనూ బుల్డోజర్ రాజ్ లు, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే విధంగా వ్యహహారాలు నడుస్తుంటే రాహుల్ గాంధీ చూసీ చూడనట్లు వ్యవహరించిన తీరును దేశం మొత్తం గమనిస్తోందన్నారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగిన చందంగా తాను చేసే పనులను ప్రజలు గుర్తించరని భావించటం రాహుల్ గాంధీ అమాయకత్వమన్నారు. రాహుల్ గాంధీ బలహీన నాయకత్వమే ప్రతిసారి బీజేపీకి వరంగా మారుతోందని చెప్పారు. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఇప్పటికైనా ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయకపోతే.. మున్ముందు కూడా కాంగ్రెస్ కు ఇంతకన్నా పెద్ద ఎదురుదెబ్బలు తప్పవని కేటిఆర్ స్పష్టంచేశారు. గాలిలో దీపంలాంటి హామీలతో రూపొందించే గ్యారెంటీ కార్డులకు ప్రజాక్షేత్రంలో కాలం చెల్లిందనే విషయాన్ని ఇప్పటికైనా కాంగ్రెస్ గుర్తుపెట్టుకోవాలని తెలిపారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల హామీ ఇచ్చి, పది నెలలైనా ఒక్క గ్యారెంటీని గాసక్రమంగా అమలుచేయని కాంగ్రెస్ కు ప్రజలు కర్రు గాల్చి వాతపెట్టడం ఖాయమని మండిపడ్డారు. తెలంగాణలో సంక్షేమ రంగాన్ని సమాధి చేసి.. పదేళ్ల ప్రగతి కి పూర్తిగా పాతరేసిన కాంగ్రెస్ పార్టీని ఆ పాపం వెంటాడటం తథ్యమని కేటిఆర్ హెచ్చరించారు.

# ఈడీ ఎదుట అజారుద్దీన్..

**కుట్ర పూరితంగా కేసులు పెట్టారు..**
**ఈడీ అధికారులకు సహకరించా**
**భారత క్రికెట్ మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్**



**జనపదం, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వరింగ్ ప్రెసిడెంట్, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజరయ్యారు. హెచ్‌సీఏలో రూ.20 కోట్ల మోసం వ్యవహారంలో ఇటీవల ఆయనకు ఈడీ నోటీసులు జారీచేసింది. దీంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో విచారణకు వచ్చారు. అనంతరం అజహర్ మాట్లాడుతూ.. తనపై పెట్టిన కేసులన్నీ అక్రమమని, కుట్రపూరితంగా కావాలనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని ఆయన అన్నారు. ఈడీ అధికారులకు పూర్తిగా సహకరించినట్లు చెప్పారు.

**ఉప్పల్ పోలీస్టేషన్ లో ఫిర్యాదులు**

2019 నుంచి 2023 వరకు హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో పలు ఫిర్యాదులు ఉన్నాయి. వీటికి తోడు ఉప్పల్ స్టేడియంలో హెచ్‌సీఏ అక్రమాలపై ఏసీబీ అధికారులు సైతం పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీటి ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఆర్ నమోదు చేశారు. అజారుద్దీన్ పదవీకాలంలో క్రికెట్ బాల్స్, బకెట్ చైర్స్, జిమ్ పరికరాలకు కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలోనే హెచ్‌సీఏలో అక్రమాలపై ఈడీ నజర్ పెట్టింది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో హెచ్‌సీఏలోని అక్రమాలపై విచారణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. కాగా ఇదే కేసులో మాజీ క్రికెటర్లు అర్షద్ అయూబ్, శివలాల్ యాదవ్‌ను గత డిసెంబర్‌లో ఈడీ అధికారులు విచారించారు.

# ఆ రైతును కలిశాను... కేసుపెడ్తారా..?

**డీజీపీకి కేటీఆర్ సూటి ప్రశ్న..**
**కేసీఆర్‌ను పొగిడిన రైతు వీడియోను పోస్ట్ చేసిన జర్నలిస్టుపై కేసు ఎలా అని నిలదీత..**

జనపదం, హైదరాబాద్ సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ....కేసీఆర్ ను పొగిడిన నల్గొండ జిల్లా రైతు వీడియోను పోస్టు చేసి జర్నలిస్టుపై కేసు నమోదు చేస్తారా?. అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఆ రైతును నేను కూడా కలిశాను... అతనితో మాట్లాడాను... మరి నాపై కూడా కేసు పెడతారా డీజీపీ గారూ? అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అనవసరంగా గెలిచిందని, కేసీఆర్ గెలవాల్సిందని నల్గొండ జిల్లాలోని ముషంపల్లి గ్రామానికి చెందిన రైతు మల్లయ్య అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను జర్నలిస్ట్ గౌతమ్ పోతగోని తన యూట్యూబ్ ఛానల్లో పోస్ట్ చేశాడు. దీంతో పోలీసులు ఆ జర్నలిస్ట్‌పై కేసు పెట్టారు. ఈ ఘటనపై కేటీఆర్ స్పందించారు. అసలు ఈ వీడియోలో తప్పు ఏముందని డీజీపీని ప్రశ్నించారు. జర్నలిస్ట్ గౌతమ్ గౌడ్‌పై కేసు ఎందుకు నమోదు చేశారని నిలదీశారు. నేను కూడా ముషంపల్లిలో రైతు మల్లయ్యను కలిశానని, అతనితో మాట్లాడానని వెల్లడించారు. అలాంటప్పుడు నాపై కూడా కేసు పెడతారా? అని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

# చకచకా లెక్కలు..

**(మొదటిపేజీ తరువాయి)** ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే కుల గణన కోసం అసెంబ్లీ, క్యాబినెట్ లో కూడా తీర్మానం చేసింది. ఈ నేపథ్యంలో కుల గణన ఎలా చేయాలి అనే దానిపై అధికారులతో చర్చించారు. వివిధ రాష్ట్రాల్లో చేసిన కుల గణన పై అధ్యయనం చేశారు. కర్ణాటక, బిహార్, ఆంధ్రప్రదేశ్ లో చేసిన కుల గణనపై సమావేశంలో చర్చించారు. కర్ణాటక లో బీసీ కమిషన్ చేసిన సర్వే, బిహార్ లో జీఏడీ ద్వారా చేసిన సర్వే, ఆంధ్రప్రదేశ్ లో పంచాయతీ రాజ్ ద్వారా సర్వే చేసిన అంశాలపై చర్చించారు. అక్కడ డోర్ టూ డోర్ పూర్తిస్థాయి సర్వే నిర్వహించారు. మూడు రాష్ట్రాల్లో చేసిన బెస్ట్ పాలసీని తీసుకొని ఇక్కడ అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

**నెలరోజుల్లో...**

మరోవైపు ఎస్సీ వర్గీకరణ కు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడం ప్రభుత్వం వర్గీకరణ మీద సబ్ కమిటీ సమావేశాలు కొనసాగుతుండటంతో కుల గణన సర్వే నివేదిక ఎస్సి వర్గీకరణ కు కూడా అవసరం ఉంటుంది కాబట్టి పూర్తిస్థాయి కులాల గణన చేసి వారికి అవసరమైన డేటా తీసుకునేలా చేసే అంశంపై చర్చించారు. రిపోర్ట్ పారదర్శకంగా ఉండడానికి ఇరు శాఖల కు సంబంధం లేకుండా కుల గణన జీఏడీ లేదా పంచాయతీ రాజ్, రెవెన్యూ లో దేని ద్వారా చెపించాలనే దానిపై రెండు రోజుల్లో సీనియర్ మంత్రులతో ప్రభుత్వం కీలక సమావేశం ఏర్పాటు చేయనుందని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కుల గణన కు సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో మానిటరింగ్ చేసేలా చూడాలని సూచించారు. కుల గణన ప్రారంభమై నెల రోజుల్లో పూర్తి చేయాలని సమావేశం లో నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, పంచాయతీ రాజ్ సెక్రటరీ లోకేష్ కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, బీసీ కమిషనర్ బాల మాయాదేవి, లా సెక్రటరీ రాజశేఖర్ ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

# కిరణ్ కు బాబు బాసట..!

**రాజ్యసభ సీటుకు హామీ**
**తెరవెనక మంత్రాంగం**
**బీజేపీ అధిష్టానం ఆమోదించేనా?**

**జనపదం, ఏపీ బ్యూరో:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పార్టీలు వేరైనా, ఒకరి ప్రయోజనాలు మరొకరు కాపాడాటానికి వీరి మైత్రీ సంబంధం కొనసాగుతూ వస్తోంది. ఇది ఇప్పటి మైత్రీ సంబంధం కానేకాదు. ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మరణించిన తరువాత అప్పటి సీనియర్ నాయకుడు కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఆయన ఎక్కువ కాలం ఆ పదవిలో కొనసాగలేకపోయారు. ఒకవైపున దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడు వైఎస్ జగన్ ప్రతీ రోజూ వత్తిడులు, మరోవైపు ఆ పధవిని ఆశించిన పలువురు నాయకులు రోశయ్యసీటుకు ఎసరు పెట్టేందుకు ప్రయత్నించారు. ప్రధానంగా అప్పటి కాంగ్రెస్ నాయకులు బొత్స సత్యనారాయణ, కన్నా లక్ష్మీ నారాయణలు సీఎం పదవి కోసం ప్రయత్నించారు. ఎవరూ ఊహించని రీతిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అస్పెంబ్లీ స్పీకర్ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు అప్పటి కాంగ్రెస్ నాయకులంతా కిరణ్ కుమార్ రెడ్డి నాయకత్వాన్ని అంగీకరించారు. అయితే వారిలో అసమ్మతి లేకపోలేదు. వారి అసమ్మతి కారణంగా ఆయన సీఎం బాధ్యతలు ఎక్కువ కాలం నిర్వహించలేరని కాంగ్రెస్ పార్టీలో బాహాటంగానే వినపడేది. అయితే అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అయిన కిరణ్ కుమార్ రెడ్డికి తెరవెనుక మద్దతు పలికారు. దీనితో ఆయన రాష్ట్ర విభజన వరకు సీఎంగానే కొనసాగారు. అంతకాలం సీఎంగా కొనసాగడానికి చంద్రబాబు ఇచ్చిన ప్రోత్సహమేనని అంతా బావించారు. పార్టీలు వేరైన ఇద్దరి మధ్య స్నేహ బంధం కొనసాగింది. ఇప్పుడు కష్టాల్లో ఉన్న కిరణ్ కుమార్ రెడ్డిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వచ్చినట్టు రాజకీయ వర్గాల్లో వినపడుతోంది. ఇందులో బాగంగానే ఇరువురు నాయకులు హైదరాబాద్ లో ఇటీవల సమావేశం



అయ్యారు. తాజా ఎన్నికల్లో నల్లారి సోదరులు పోటీ చేసారు. కిషోర్ ఎమ్మెల్యేగా గెలవగా..కిరణ్ ఎంపీగా ఓడారు. కిరణ్ కోసం చంద్రబాబు ప్రచారం చేసారు. ఇప్పుడు అదే నల్లారి కిరణ్ కు కీలక పదవి కోసం చంద్రబాబు సిఫార్సు చేస్తున్నట్లు తెలుస్తోంది.

చంద్రబాబుతో భేటీతో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ లో ఉంటూ సీఎం అయిన కిరణ్..రాష్ట్ర విభజనను తాను చివరి బంతితో ఆపుతానంటూ చెప్పుకొచ్చారు. రాష్ట్ర విభజనతో సీఎం పదవితో పాటుగా కాంగ్రెస్ కు రాజీనామా చేసారు. ఆ తరువాత కొత్త పార్టీ పెట్టి విఫలమయ్యారు. తిరిగి కాంగ్రెస్ లో చేరినా వెంటనే దూరమయ్యారు. చివరకు బీజేపీలో చేరిన కిరణ్ తాజా ఎన్నికల్లో రాజంపేట నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇక, ఇప్పుడు కిరణ్ కీలక పదవి కోరుకుంటున్నారు.

రాజ్యసభ సీటు కోసం ఏపీ నుంచి మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యాయి. అందులో భాగంగా టీడీపీకి రెండు, జనసేనకు ఒకటి దక్కుతుందనే వాదన ఉంది .అయితే, తాజాగా చంద్రబాబుతో కిరణ్ భేటీ అయ్యారు. మూడు రాజ్యసభ స్థానాల్లో క్రిష్ణయ్య బీజేపీలో చేరే అవకాశం ఉండటంతో..ఆయన సీటు బీజేపీకి కేటాయించాలని కోరినట్లు తెలుస్తోంది. మూడు పార్టీలకు మూడు స్థానాలు దక్కేలా చర్చలు చేసినట్లు సమాచారం. అదే సమయంలో బీజేపీ నుంచి కిరణ్ ఆ స్థానంలో రాజ్యసభకు వెళ్లాలనే ఆలోచనతో ఉన్నారని చెబుతున్నారు. ఇదే అంశం పైన చంద్రబాబుతో చర్చించారు. వచ్చే వారం మూడు రాజ్యసభ స్థానాలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. కిరణ్ కు ఛాన్స్ దక్కేనా మాజీ సీఎంగా పని చేసిన కిరణ్..ఇప్పుడు బీజేపీ జాతీయ కార్యవర్గంలో ఉన్నారు. ఏపీ నుంచి ప్రస్తుతం బీజేపీకి ఎవరూ రాజ్యసభ సభ్యులు లేరు. టీడీపీ, జనసేన నుంచి గల్లా జయదేవ్, నాగబాబు పేర్లు ఖాయమనే ప్రచారం సాగుతోంది. దీంతో, రాయలసీమ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి రాజ్యసభ సీటు ఇవ్వాలంటే తనకు అవకాశం ఇవ్వాలని కిరణ్ కోరుతున్నట్లు సమాచారం. కేంద్ర మంత్రివర్గంలోనూ రాయలసీమకు ప్రాధాన్యత దక్కలేదు. దీంతో..చంద్రబాబు సైతం హామీ ఇచ్చారని పార్టీలో చర్చ జరుగుతోంది. అయితే సామాజిక సమీకరణాలు కీలకంగా మారుతున్న వేళ.. మూడు రాజ్యసభ స్థానాల ఖరారులో చివరికి ఎవరికి అవకాశం దక్కుతుందనేది తేలాల్సి ఉంది.



## భవానీ మాతగా భద్రకాళి

- వైభవంగా కొనసాగుతున్న దేవీ నవరాత్రోత్సవాలు
- దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**స్పాట్ వాయిస్, కల్చరల్ :** వరంగల్ లోని భద్రకాళి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు మంగళవారం ఉదయం 4 గంటలకు నిత్యహ్నికం నిర్వర్తించిన అనంతరం అర్చకులు అమ్మవారిని భవానీ మాతగా అలంకరించి, పూజలు చేశారు. అమ్మవారికి కాత్యాయని క్రమంలోను, భోదాయనమహర్షి ప్రోక్త నవరాత్రా కల్పాన్ని అనుసరించి ధూమ్రహా క్రమంలోను పూజారాధనలు జరిపారు. అలాగే అమ్మవారికి గందోత్సవం నిర్వహించారు. సాయంకాలం సాలభంజిక సేవ జరిపారు. రేపు అమ్మవారు సరస్వతీ మాతగా దర్శనమివ్వనున్నారని ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. అమ్మవారి విశేష అలంకరణకు కరీంనగర్ వాస్తవ్యులు ప్రముఖ వ్యాపారవేత్త యాదా కిషన్-శోభ దంపతులు, మంచాల శ్రీకాంత్-కవిత దంపతులు, మంచాల నవీన్- స్వప్న దంపతులు, రేగూరి ఆంజనేయులు-సరళ దంపతులు, హైదరాబాద్ శారద విద్యాసంస్థల అధినేతలు సందెపూడి రవి శంకర్-మానస, తిక్కవరపు కేశవ రెడ్డి-మంజుల దంపతులు, అభిరామ్ రెడ్డి- సింధూర దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. పూజనంతరం ఉభయ దాతలకు ఆలయ ఈవో శేషభారతి శేష వస్త్రాలు బహూకరించి, ప్రసాదాలు అందజేశారు. కాగా, అమ్మవారిని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి దర్శించుకున్న అనంతరం అమ్మవారి తెప్పోత్సవం సందర్భంగా భద్రకాళి చెరువులో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే యాదగిరిగుట్ట చైర్మన్ భాస్కరాయని నరసింహ మూర్తి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.



# హైడ్రాతో సర్వే ఆఫ్ ఇండియా

**ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించేందుకు భారీ కసరత్తు**

**జనపదం, సిటీ బ్యూరో:** హైదరాబాద్ మహానగరంలో చెరువుల పునరుద్ధరణ కోసం హైడ్రాతో కలిసి పనిచేసేందుకు సర్వే ఆఫ్ ఇండియా ముందుకొచ్చింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించడంలో ఇకపై సర్వే ఆఫ్ ఇండియా భాగస్వామ్యం కానున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. తన బృందంతో కలిసి హబ్సిగూడలోని సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి రంగనాథ్ వెళ్లారు. సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బీసీ పరీడా, సూపరింటెండెంట్ ఆఫ్ సర్వే దేబబ్రత పాలిట్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన పాత మ్యాప్‌లను పరిశీలించిన రంగనాథ్ 1971 – 72 సర్వే ప్రకారం నగరంలో ఎన్ని చెరువులున్నాయి? ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి? ప్రస్తుతం వాటి పరిస్థితి ఏంటి? నాలాలు ఎంత విస్తీర్ణంలో ఉండేవి, ఇప్పుడు ఎంత మేర కబ్జా అయ్యాయనే తదితర వివరాలను మ్యాప్‌లతో సహా పరిశీలించారు. దశాబ్దాల క్రితం నాటి మ్యాప్‌లతో పాటు నేటి పరిస్థితిని సరిపోల్చుతూ చెరువులు, నాలాల వివరాలను సర్వే ఆఫ్ ఇండియా అధికారులు రంగనాథ్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇప్పటికే హెచ్ఎండీఏ, నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ నుంచి సేకరించిన చెరువుల జాబితాతో సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి చెరువులు, నాలాల పరిస్థితి, కనుమరుగైన చెరువులపై డాటాను పరిశీలించారు.

**హైడ్రా చర్యలు**

సర్వే ఆఫ్ ఇండియా అందించిన వివరాలతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని చెరువులపై సమగ్ర నివేదిక తయారు చేస్తామని, ఆ డేటాను డిజిటలైజేషన్‌తో పాటు చెరువుల వాస్తవ విస్తీర్ణం, నాలాల పొడవు, వెడల్పులను నిర్ధారించి పూర్తి వివరాలతో నివేదికను సిద్ధంగా చేయనున్నట్లు రంగనాథ్ వెల్లడించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను శాస్త్రీయ పద్ధతిలో నిర్ధారించి తదుపరి చర్యలను చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు రంగనాథ్ తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో చెరువులను ఒకదాని తర్వాత ఒకటిగా పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.



# విస్తరణకు విశ్రాంతి..

**(మొదటిపేజీ తరువాయి)** పెద్దలతో సమావేశం కావాల్సి ఉండగా వర్కౌట్ కాలేదు. ఎంతకీ అధిష్టానం ఆయనకు సమయమివ్వకపోగా, కనీసం వెయిట్ చేయండనే మాట కూడా చెప్పకుండా ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. ఏదైనా సలహానో, సూచనో అయినా చేసి పంపిస్తారని నిరీక్షించినా అదీ జరగలేదు. దీంతో 24 గంటల పాటు ఇంట్లోనే గడిపిన సీఎంకు అసలు విషయం అర్థమైంది. ఇక సమయం వృథా చేయకుండా, ఇక్కడ చేయాల్సిన కార్యాలపై సమయం మించిపోకుండా వెనుదిరిగారు.

**హర్యానా షాక్ లో అధిష్టానం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గంలో సరిపడ అనుచరులను నింపుకోవడానికి ఆశగా చూస్తున్న వారితో పాటు బాధ్యత నిర్వర్తించాలని నిర్ణయించుకున్న సీఎంకు మంగళవారం ఊహించని షాకే తగిలింది. హర్యానా, జమ్ముకశ్మీర్‌ఎన్నికల ఫలితాల విడుదల కూడా ఈ రోజే కావడంతో అనుకున్నట్టుగా జరగలేదు. అందునా ఫలితాలు పూర్తిగా తారుమారుగా మారడంతో ఇక కలుసుకునే అవకాశం కూడా కల్పించకుండా పెద్దలంతా సీఎం రేవంత్ ను కలువడానికి ఇష్టపడలేదు. మరీ ముఖ్యంగా హర్యానా రిజల్ట్స్ హస్తం పార్టీకి ఊహించకుండా దెబ్బకొట్టడంతో ఎంకిపెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టుగా ఆ రాష్ట్ర ఫలితం మన రాష్ట్ర పదవుల పంపకాన్ని నిలుపు చేయించింది. దీంతో ఆశావహులు, ఎండ్లుగా పదవికి మోహం వాచిన వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. సీనియర్లుగా అనుభవం సంపాదించినా, సరైన సమయంలో దక్కాల్సిన మంత్రి పదవి ఊరిస్తుండడంతో చేసేది లేక తమలో తామే అనుచుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు.

**ముగిసిన సీఎం ఢిల్లీ పర్యటన**

ఎట్టకేలకు సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటన ముగిసింది. మా కోసం మా రాజు ఏదైనా బహుమతి తీసుకు రాకపోతాడా అని చూసిన వారు ఆయన కాస్త నిశ్శబ్దం వెనుదిరగడంతో తీవ్ర అసహనంతో ఉన్నారు. కేవలం కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాల కోసం పడుతున్న శ్రమను గుర్తించి ఇవ్వాల్సిన వాటితో పాటు మరికొన్ని అదనంగా మంజూరు చేయాలని వినతులు అందజేసిన సీఎం కాంగ్రెస్ పార్టీ పెద్దల దర్శనం కష్టమని తెలియడంతో ఖాళీ చేతులతో తిరిగొచ్చారు. మరీ ముఖ్యంగా పంట నష్టం, వరద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కావాల్సిన నిధులు., అన్నింటికన్న ముఖ్యంగా ఐపీఎస్ ల కేటాయింపుపై తీవ్ర సమాలోచనలు చేసి తిరిగొచ్చారు.

## ఒంటరి తనం.. పలుచనైన బలం..

**సీఎం రేవంత్ రెడ్డి ప్రతి సారి ఢిల్లీ పర్యటనకు ఎవరో ఒఖరిని వెంట పెట్టుకుని వెళ్లే వారు. పలుమార్లు డిప్యూటీ సీఎం భట్టి, ఉత్తమ్, శ్రీధర్ బాబు, జూపల్లి., ఇలా ఎవరో ఒకరు అంతకు మించిన మంత్రులతో వెళ్లి అవసరాలను ఏకరువు పెట్టి సాధించుకుని వచ్చేవారు. కానీ ఈ సారి ఆయన ఒంటరిగానే కావాల్సిన సాధిస్తారని అనుకున్నా, ఏ మాత్రం సాధ్యం కాదని తెలుసుకుని ఉత్త చేతులతో వచ్చేశారు. ఆయన ఒంటరిగా వెళ్లడమే బలాన్ని హరించుకుపోయినట్టు అయిందని, దాని ప్రభావం కూడా సమాలోచనలపై పడిందని విశ్లేషించేవారు కూడా లేకపోలేదు.**

# మా పరువు పోయింది..

- మంత్రి మాటలతో నొచ్చుకున్నాం..
- నా ఫ్యామిలీపై కొండా సురేఖవి తప్పుడు వ్యాఖ్యలు
- దేశమంతా అభిమానులున్న కుటుంబం మాది..
- కోర్టులో హీరో నాగార్జున స్టేట్‌మెంట్
- విచారణ రేపటికి వాయిదా
- మరో సాక్షి వాంగ్మూలం కూడా అదే రోజు



**జనపదం, నాంపల్లి:** అక్కినేని ఫ్యామిలీపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రంలో దుమారం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమ కుటుంబంపై తీవ్ర ఆరోపణలు చేసినందుకు గానూ.. కొండా సురేఖపై నాగార్జున పరువు నష్టం దావా వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఈరోజు నాగార్జునతో పాటు సాక్షుల వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. ఈ క్రమంలో.. నాగార్జున కోర్టుకు తన వాదన స్వయంగా వినిపించారు. అక్కినేని కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే.. కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టులో అక్కినేని నాగార్జున పరువు నష్టం దావా వేసిన విషయం తెలిసిందే. అయితే.. ధర్మానసం ఆదేశాల మేరకు.. నేడు (అక్టోబర్ 08న) నాగార్జున నేరుగా నాంపల్లి కోర్టుకు వెళ్లారు. నాగార్జున వెంట.. ఆయన సతీమణి అమల, కుమారుడు నాగచైతన్యతో పాటు సుప్రియ, నాగ సుశీల, వెంకటేశ్వర్లు కూడా కోర్టుకు హాజరయ్యారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. మంత్రి కొండా సురేఖపై ఎందుకు పిటిషన్ ఫైల్ చేశారని నాగార్జునను ప్రశ్నించింది. ఈ క్రమంలో.. నాగచైతన్య, సమంతల విడాకులపై, తమ కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలను ధర్మాసనానికి నాగార్జున వివరించారు. ఈ నేపథ్యంలో నాగార్జున స్టేట్‌మెంట్‌ను కోర్టు రికార్డు చేసింది. మంత్రి కొండా సురేఖ తన కుటుంబంపై అమర్యాదపూర్వకమైన తప్పుడు వ్యాఖ్యలు చేశారని ధర్మాసనానికి నాగార్జున తెలిపారు. నాగచైతన్య, సమంత విడాకులపై మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కొండా సురేఖ వ్యాఖ్యలతో తమ కుటుంబ పరువు, మర్యాదలకు భంగం వాటిల్లిందని కోర్టుకు స్టేట్‌మెంట్ ఇచ్చారు. మంత్రి చేసిన వ్యాఖ్యలతో తమ కుటుంబం తీవ్ర మనోవేదనకు గురైందన్నారు. సినీరంగంలో ఉన్న వారిపై రాజకీయ ఆరోపణలు చేయటం సరికాదని నాగార్జున తెలిపారు. సినిమా రంగం ద్వారా తమ కుటుంబానికి సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు ఉన్నాయని.. దేశ వ్యాప్తంగా తమ కుటుంబం పట్ల ప్రజల ఆధారాభిమానాలు ఉన్నాయని ధర్మాసనానికి నాగార్జున వివరించారు.

జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వచ్చాయని కూడా తెలిపారు. సినిమా రంగంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు సైతం చేస్తున్నామని వివరించారు. మాజీ మంత్రి కేటీఆర్ వల్లే తన కొడుకు విడాకులు తీసుకున్నాడంటూ మంత్రి అసభ్యంగా మాట్లాడారని ధర్మాసనం ముందు నాగార్జు ఆవేదన వ్యక్తం చేశారు. అలా మాట్లాడం వల్ల తమ కుటుంబ పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లిందని తెలిపారు. రాజకీయ దురుద్దేశంతోనే కొండా సురేఖ తమపై తప్పుడు ఆరోపణలు చేశాని నాగార్జున ఆరోపించారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను స్థానిక మీడియాతో పాటు జాతీయ మీడియాలో కూడా ప్రసారమైందని ధర్మాసనానికి తెలిపారు. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నాంపల్లి కోర్టును నాగార్జున కోరారు. ఈమేరకు నాగార్జున వాంగ్మూలాన్ని నాంపల్లి కోర్టు రికార్డు చేసింది.

నాగార్జున వాంగ్మూలంతో పాటు మొదటి సాక్షిగా యార్లగడ్డ సుప్రియ స్టేట్‌మెంట్లను కూడా కోర్టు రికార్డు చేసింది. నాగ చైతన్య, సమంత.. మాజీ మంత్రి కేటీఆర్ వలనే విడాకులు తీసుకున్నారని మంత్రి కొండా సురేఖ మాట్లాడారని సుప్రియ తెలిపారు. ఎన్-కన్వెన్షన్ విషయంలో సమంతను కేటీఆర్ దగ్గరికి పంపించమంటే సమంత ఒప్పుకోలేదని అందుకే విడాకులు తీసుకుందని మంత్రి మాట్లాడారని తెలిపారు. మంత్రి వ్యాఖ్యలు విని తమ కుటుంబం మొత్తం షాకయ్యామన్నారు. మంత్రి తమ కుటుంబంపై ఎందుకు ఇలా మాట్లాడారో తమకు అర్థం కాలేదన్నారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు తాను కొన్ని మీడియాలలో చూశానని.. నేషనల్ మీడియాలో సైతం ఈ వార్త విన్నానని సుప్రియ తెలిపారు. మరుసటి రోజు పేపర్లో సైతం వార్త వచ్చిందని చెప్పుకొచ్చారు. మంత్రి చేసిన వ్యాఖ్యలతో తమ కుటుంబం తీవ్ర మనో వేదనకు గురైందని సుప్రియ తెలిపారు. సుప్రియ వాంగ్మూలం రికార్డు చేసుకున్న తర్వాత.. విచారణను ఈ నెల 10కి ధర్మాసనం వాయిదా వేసింది. కాగా, మరో సాక్షి వెంకటేశ్వర్లు వాంగ్మూలాన్ని కూడా అదే రోజున రికార్డు చేయనున్నారు.

# వర్గీకరణ అమలుకు న్యాయ కమిషన్..



- ఏకవ్యక్తి ఆధ్వర్యంలో నియామకం..
- ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన అధికారుల బృందం
- పరిగణనలోకి అడ్వకేట్ జనరల్ సూచనలు..
- రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు..
- ఉత్తమ్ అధ్యక్షతన భేటీ..
- హాజరైన దామోదర్, దుద్దిళ్ల, సీతక్క, పొన్నం

**జనపదం, హైదరాబాద్ సిటీ:** ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏక వ్యక్తి కమిషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసింది. కమిషన్ నియామకంలో అడ్వకేట్ జనరల్ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఉప సంఘం తీర్మానించింది. అంతే గాకుండా ఏకవ్యక్తి కమిషన్ చట్టపరంగా పటిష్టంగా ఉండడంతో పాటు కమిషన్ సిఫారసులను అమలులోకి తీసుకొస్తే న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ఉండేలా నియామకం జరిగేలా చూడాలని ఉపసంఘం ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, లోకసభ సభ్యులు మల్లు రవి ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో నాలుగోసారీ మంత్రివర్గ ఉప సంఘం సమావేశం అయ్యింది. మంత్రులు దామోదర్ రాజ నరసింహా, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, లా సెక్రటరీ తిరుపతి తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ అభివృద్ధి శాఖా ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, ఐఏఎస్ అధికారులు బుర్రా వెంకటేశం, లోకేష్ కుమార్, దాన కిశోర్, శ్రీదేవి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూఎస్సీ వర్గీకరణ విషయంలో ఇప్పటికే అధికారుల బృందం తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఉపకులాల వర్గీకరణ ఉంటుందని అందుకు సంబంధించిన పూర్తి సమాచారం ఉద్యోగ నియామకాలతో సహా నివేదికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ వర్గీకరణపై ప్రజాభిప్రాయ సేకరణకు మంత్రివర్గ ఉప సంఘం జిల్లాల వారీగా పర్యటించనున్నట్లు ఆయన వెల్లడించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అధ్యయనాన్ని టైంబౌండ్ ప్రోగ్రాం పెట్టుకుని పూర్తి చేయాలన్నారు. అలాగే యుద్ధప్రాతిపదికన బీసీల సాంఘిక ఆర్థిక గణన చేపట్టాలని సూచించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

# ఎన్టీఆర్ తో రుక్మిణి వసంత్

**యంగ్ టైగర్ ఎన్టీఆర్ కన్నడ స్టార్ దర్శకుడు కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ తో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. #NTRNeel గా రానున్న ఈ సినిమాకు డ్రాగన్ అనే టైటిల్‌ను అనుకుంటున్నారు. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ నుంచి షూటింగ్ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ మూవీలో 'సప్త సాగరాలు దాటి' చిత్రం హీరోయిన్ రుక్మిణి వసంత్ కథానాయికగా నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే ఈ మూవీని ఒకటే పార్ట్‌లో ఫినిష్ చేయనున్నట్లు తెలుస్తుంది. మరోవైపు తారక్ జనవరి నుంచి ఈ మూవీ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 09 2026లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.**







# హ్యాపీ బర్త్ డే మారుతీ

**పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న కొత్త మూవీ 'ది రాజా సాబ్' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు మారుతి డైరెక్ట్ చేస్తుండగా, హార్రర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రానుంది. ఇక ఈ సినిమాలో ప్రభాస్ వింటేజ్ డార్లింగ్ లుక్స్‌లో కనిపిస్తుండటంతో ప్రేక్షకులు ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఆసక్తిగా ఉన్నారు. నేడు దర్శకుడు మారుతి పుట్టినరోజు సందర్భంగా 'ది రాజా సాబ్' మేకర్స్ ఓ స్పెషల్ వీడియో రూపంలో ఆయనకు బర్త్ డే విషెస్ తెలిపారు. 'ది రాజా సాబ్' చిత్రానికి సంబంధించిన స్పెషల్ మేకింగ్ వీడియోను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ వీడియోలో దర్శకుడు మారుతి ఈ చిత్రం కోసం ఎంతలా కష్టపడుతున్నారో మనకు చూపెట్టారు. ఇక ఈ వీడియోతో అభిమానులు సర్‌ప్రైజ్ అయ్యారు.**





# డిసెంబర్ లో అఖండ-2

**బాలయ్య-బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వచ్చిన అఖండ అద్భుత విజయాన్ని అందుకుంది. దీంతో 'అఖండ-2' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు అంటూ బాలయ్య ఫ్యాన్స్ పోస్ట్‌లు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ చివరి దశలో ఉంది. డిసెంబర్ లో ఈ సినిమా షూటింగ్ ను స్టార్ట్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్ లో బాలయ్య పాత్ర తాలూకు పరిచయ షాట్స్ ను తీస్తారట. మొత్తానికి ఈ సినిమా కోసం బాలయ్య ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బోయపాటి శ్రీను ఇప్పటికే 'అఖండ 2' స్క్రిప్ట్ పూర్తి చేశాడు. ప్రస్తుతం డైలాగ్ వెర్షన్ పై కసరత్తులు చేస్తున్నారు. కాగా 'అఖండ 2' లో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా ఓ కీలక పాత్రలో నటించబోతునట్లు తెలుస్తోంది.**

# బిగ్ బాస్ టీంలోకి మహేశ్ బాబు మరదలు..

సూపర్ క్రేజ్ సంపాదించుకున్న టెలివిజన్ రియాలిటీ షో బిగ్ బాస్. ప్రస్తుతం తెలుగు బిగ్ బాస్ సీజన్-8 కొనసాగుతుంది. బిగ్ బాస్ తాజా సీజన్ సోమవారం షురూ అయింది. ఈ టీంలోకి టాలీవుడ్ స్టార్ యాక్టర్ మహేశ్ బాబు మరదలు శిల్పా శిరోద్కర్ ఎంట్రీ ఇచ్చి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. శిల్పా శిరోద్కర్ లాంగ్ గ్యాప్ తర్వాత స్క్రీన్‌పైకి కమ్ బ్యాక్ ఎంట్రీ ఇవ్వడం అటు మహేశ్ బాబు కుటుంబంతోపాటు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మహేశ్ బాబు అభిమానులకు గుడ్ న్యూస్ అనే చెప్పాలి. నమ్రతా శిరోద్కర్ కంటే ముందే సిల్వర్ స్క్రీన్‌పై గ్రాండ్ డెబ్యూ ఇచ్చిన శిల్పా శిరోద్కర్.. 90ల తొలినాళ్లలో వన్ ఆఫ్ ది టాప్ స్టార్లలో ఒకరిగా ఓ వెలుగు వెలిగింది. మరి బిగ్ బాస్ షోలో ఎలాంటి ఇంప్రెషన్ కొట్టేస్తుందో చూడాలి.



Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com